Follow: @ANNTELUGU
18-09-2026
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 239 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో ఆధునిక తెలంగాణ నిర్మాణం

- రైతు, మహిళ, పేద, యువత సంక్షేమమే ప్రజా పాలనకు పునాది
- తెలంగాణను 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతాం
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి ఫలాలు అందేలా నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17న నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. రైతుకు భరోసా, మహిళలకు ఆర్థిక స్వావలంబన, అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం, పేదలకు నాణ్యమైన విద్య-వైద్యం, యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు

మిగతా 3వ పేజీలో

టాప్ న్యూస్

### కేసీఆర్ కుటుంబ భూములపై విచారణ జరపాలి



- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ డిమాండ్

02

### ఎన్డీయే బలం ఐక్యతలోనే ఉంది



- ఏపీ సీఎం చంద్రబాబు
- మోదీ లాంటి ప్రధాని ఉండడం దేశం చేసుకున్న అదృష్టం

02

### పటేల్ కృషితో హైదరాబాద్ భారత్‌లో విలీనమైంది



- విమోచన వేడుకల్లో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

02




# ఫామ్ హౌస్ ఫైల్స్

## కేసీఆర్ వ్యవసాయక్షేత్రం సర్వేపై అధికారుల కసరత్తు
## సీఎం ఆదేశాలతో రంగంలోకి రెవెన్యూ అధికారులు
## ఎర్రవెల్లిలో ఉద్రిక్తత.. నేడు సిద్దిపేట జిల్లాకు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్సీలు

**హైదరాబాద్, మహా:** కేసీఆర్ ఫామ్ హౌస్ చుట్టూ ప్రెజర్ పాలిటిక్స్ జరుగుతున్నాయి. గతంలో ఈటల రాజేందర్ ను బర్తరఫ్ చేయడంతో పాటు ఆయన భూములను స్వాధీనపరుచుకునేందుకు ఆగమేఘాల మీద సర్వే టీమ్ లను, జాయింట్ కలెక్టర్లను, విచారణ అధికారులను కేసీఆర్ రంగంలోకి దింపగా, ఇపుడు అదే తరహాలో కేసీఆర్ ఫామ్ హౌస్ లో ప్రభుత్వభూమిని నిగ్గుతేల్చేందుకు అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో అధికారులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని మర్కుక్ మండలం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సంబంధించిన భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ ఫామ్ హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నెంబర్లు, గతంలో ఉన్న రైతుల పేర్లు, ప్రస్తుత రికార్డులను రెవెన్యూ అధికారులు నివేదికల రూపంలో తయారు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే ఆర్డీవో చంద్రకళ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. మర్కూక్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఎర్రవల్లిలోని సర్వేనంబర్ 325లో ప్రభుత్వ భూములను పరిశీలించారు. కాగా కేసీఆర్ కుటుంబ ఆస్తులకు సంబంధించిన వివరాలను సీఎం అసెంబ్లీలో వెల్లడించారు. గత ప్రభుత్వంలో అక్రమంగా ఆస్తులు సంపాదించారని సీఎం ఆరోపించారు. 700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందా లేదా తేల్చాలని ఆయన ఆదేశించారు. 388 ఎకరాల ప్రభుత్వ భూమి

మిగతా 2వ పేజీలో




# అక్రమార్కుల అరాచకం..!

## తూంకుంటలో 5 ఎకరాల కస్టోడియన్ భూముల దురాక్రమణ..!

- ఇవాక్యూ ప్రాపర్టీని ఆక్రమించిన అలంకృత రిసార్ట్, బాలాజీ గార్డెన్, రాగి కన్వెన్షన్..!
- యథేచ్ఛగా ప్రీకాస్ట్ వాల్స్, ప్రహరీ గోడలు, ఆర్చ్ నిర్మాణాలు..!
- హైకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలు..!
- నిర్మాణాలను అడ్డుకుని.. కూల్చివేతలు జరపాలంటున్న స్థానికులు..!
- కలెక్టర్ స్పందిస్తేనే అక్రమార్కులకు చెక్..!

02

తూంకుంటలో అక్రమార్కుల అరాచకం రాజ్యమేలుతోంది. వందల కోట్ల విలువైన కస్టోడియన్ (ఇవాక్యూ) భూములపై కన్నుబడి దురాక్రమణకు తెగబడ్డారు. సుమారు 5 ఎకరాల భూమిని రిసార్టులు, కన్వెన్షన్ల పేరుతో ఆక్రమించి రెవెన్యూ యంత్రాంగానికే సవాల్ విసిరారు.ప్రభుత్వ నిబంధనలు, హైకోర్టు ఉత్తర్వులను సైతం భేఖాతరు చేస్తూ ఈ విలువైన భూముల్లో అలంకృత రిసార్ట్, బాలాజీ గార్డెన్, రాగి కన్వెన్షన్ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ ప్రీకాస్ట్ కాంపౌండ్ వాల్స్, ప్రహరీ గోడలు, ఆర్చ్‌లను నిర్మిస్తూ సదరు భూమిని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు కుయుక్తులు పన్నారు. కలెక్టర్ స్పందిస్తేనే ఆక్రమణదారుల అక్రమాలకు చెక్ పడుతోందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



కస్టోడియన్ భూమిలో ఉన్న అలంకృత రిసార్ట్



కస్టోడియన్ భూమిలో ఉన్న బాలాజీ గార్డెన్

### ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధం



- దమ్ముంటే సీఎం సవాల్‌ను స్వీకరించాలి
- కేటీఆర్ డిమాండ్

02

### చిప్ తయారీలో భారత్‌కు ఇదే కీలక మలుపు

- భారీ పెట్టుబడులతో ముందుకు రండి.
- ప్రపంచ సంస్థలకు ప్రధాని మోదీ పిలుపు.
- సెమీకాన్ భారత్–2026కు 52 దేశాల ప్రతినిధులు.
- 600కు పైగా సంస్థల భాగస్వామ్యం.

04



### మియాపూర్ జె.పి నగర్ లో భారీ అక్రమ నిర్మాణం

- అనుమతులకు మించి.. భారీ అంతస్తులు
- సిఎంసి అధికారుల అండదండలతో.. బిల్డర్ నిబంధనల ఉల్లంఘన

04



### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నగారా

- ఓటర్ల నమోదు అంకం షురూ
- నంబరు 6లోపు నమోదు చేసుకోవాలి
- పాత జాబితాలో పేరున్నవారూ మళ్లీ దరఖాస్తు చేయాల్సిందే.

04



### కేటీఆర్ పీఆర్వో మహేష్ అరెస్టు

- పోలీసుల విధులకు ఆటంకం
- బొల్లారం లో ఏసీపీని తోసేసిన మహేష్

03





### మీనాక్షి నటరాజన్‌పై మళ్లీ న్యాయపోరాటం

- విదేశీ పర్యటనకు అడ్డుకట్ట వేయాలంటూ కోర్టును ఆశ్రయించిన శ్రీలత.
- రాజ్యసభ నామినేషన్ వివాదం తర్వాత మరోసారి తెరపైకి కేసు.

03

# టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నట్లా.. లేనట్లా..?

- జోడిమెట్లలో అక్రమ షెడ్డుకు అడ్డుకట్టేది ...!
- అక్రమ షెడ్డుకు ఎవరి అండదండలు...?
- ప్రశ్నార్థకంగా మారిన అధికారుల వైఖరి..!
- ఫిర్యాదులు వెల్లువెత్తినా చర్యలు శూన్యం..!

## ఘట్‌కేసర్ సర్కిల్‌లో ఏం జరుగుతోంది...?



**మహా, సిటీ బ్యూరో:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం డివిజన్, జోడిమెట్ల వద్ద అక్రమ షెడ్ నిర్మాణ వ్యవహారం, టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి పక్కన, 'తాజా కిచెన్' ఎదురుగా నిర్మిస్తున్న అక్రమ షెడ్డు 3 రోజుల విరామం తర్వాత మళ్ళీ మొదలయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్డు నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడం పలు తావిస్తోంది. అధికారులకు, అక్రమార్కుల మధ్య 'బేరం' కుదరడంతోనే నిలిచిపోయిన పనులు మళ్లీ చకచకా సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**హైవే పక్కనే అక్రమ షెడ్డు ... అడ్డుకోవడంలో విఫలమైన టౌన్ ప్లానింగ్ అధికారులు !**

వందలాది వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారి పక్కనే ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వాణిజ్య షెడ్డు నిర్మాణం జరుగుతున్నా అడ్డుకునే

మిగతా 2వ పేజీలో

# అక్రమార్కుల అరాచకం..!

**మహా, బ్యూరో చీఫ్, హైదరాబాద్:**
మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, శామీర్‌పేట్ మండలం, కీసర సర్కిల్ తూంకుంట డివిజన్ కస్టోడియన్/విస్థాపితుల భూములకు సంబంధించిన వివాదం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దేశవిభజన సమయంలో పాకిస్థాన్ నుండి వలస వచ్చిన శరణార్థులు ముమ్మల్‌దేవి కన్వర్‌మల్ లఖ్వానీ, ఫాతుమల్ కన్వర్‌మల్ లఖ్వానీ, విషందాస్ కన్వర్‌మల్ లఖ్వానీ కుటుంబ సభ్యులకు భారత ప్రభుత్వం కేటాయించిన కోట్ల రూపాయల విలువైన కస్టోడియన్ (ఎవాక్యూ) భూములపై అక్రమార్కులు పంజా విసురుతున్నారు. సర్వే నంబర్లు 81 నుండి 87 వరకు ఉన్న మొత్తం 24 ఎకరాల 24 గుంటల భూమిలో సుమారు 5 ఎకరాల భూమిని అలంక్రిత రిసార్ట్, బాలాజీ గార్డెన్, రాగి కన్వెన్షన్ వంటి సంస్థల పేరుతో అక్రమార్కులు ప్రభుత్వ నిబంధనలు, భూ కేటాయింపు (సనద్) ఉత్తర్వులను పూర్తిగా పక్కనపెట్టి, కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ ప్రహరీ గోడలు, ప్రీకాస్ట్ వాల్స్, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని బాధిత వారసులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ మెమోలు, 'సనద్' ఆదేశాలు బేఖాతరు!**
గతంలో ప్రభుత్వం జారీ చేసిన మెమో నెం . 3673/జె ఏ.1/20092 (తేదీ: 10042009) ప్రకారం.. 1967లో బాంబే రీజినల్ సెటిల్‌మెంట్ కమిషనర్ ఇచ్చిన 'సనద్' (సనద్ నెం. 49)కేటాయింపు ఉత్తర్వుల ఆధారంగా రెవెన్యూ రికార్డుల్లో స్పష్టమైన మార్పులు (మ్యుటేషన్ ) చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ కే.రత్నప్రభ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అలాగే ఈ భూమిపై టి.రాజయ్య దాఖలు చేసిన క్లెయిమ్‌ను కేంద్ర ప్రభుత్వం 23.6.1967లోనే తిరస్కరించిందని, పహాణీల్లో అతని పేరు నమోదు కావడం తప్పు అని పేర్కొంటూ రికార్డుల్లో సవరణలు చేయాలని కలెక్టర్‌కు వారసుల కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకున్నారు. ఇన్ని స్పష్టమైన ఉత్తర్వులు, ఆధారాలు ఉన్నప్పటికీ అక్రమార్కులు అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని కస్టోడియన్ భూములను నొక్కేసేందుకు అక్రమార్కులు తెగబడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.



**గతంలోనే క్రిమినల్ కేసులు, ఎఫ్ఐఆర్ (క్రైమ్ .నెం. 72/2018) నమోదు!**
ఈ భూములకు సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి, క్రయవిక్రయాలు జరుపుతూ రెవెన్యూ రికార్డులను ఫోర్జరీ చేశారనే ఆరోపణలపై గతంలోనే షామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం . 72/2018 (ఐపీసీ సెక్షన్స్ 418, 420, 447, 467, 468) కింద క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. 1954 డిస్‌ప్లేస్డ్ పర్సన్స్ చట్టం కింద ఇచ్చిన 'సనద్' (సనద్ నెం . 49, తేదీ : 17.04.1967) హక్కులను హరించేలా నిందితులు కుమ్మక్కై, ఎలాంటి టైటిల్, యాజమాన్య హక్కులు లేకుండా నకిలీ సేల్ డీడ్స్ సృష్టించి, రెవెన్యూ రికార్డులలో పేర్లు నమోదు చేసుకుని అక్రమంగా ల్యాండ్ గ్రాబింగ్, ట్రెస్‌పాస్‌లకు పాల్పడుతున్నారని ఎఫ్ఐఆర్‌లో స్పష్టంగా నమోదు చేశారు. కబ్జాకు పాల్పడుతున్న పలువురిపై బాధితులు, జీపీఏ హోల్డర్లు డాక్టర్ జి. వెంకట్ రెడ్డి, పి. రామ్‌గోపాల్ రావు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కూడా చేపట్టారు. ఎఫ్ఐఆర్ నమోదై, తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నా అక్రమార్కుల్లో ఏమాత్రం భయం లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడం గమనార్హమని స్థానికులు పేర్కొంటున్నారు.

**హైకోర్టు ఆదేశాలు (డబ్ల్యూ. పి. నెం . 10916 / 2026) బేఖాతరు**
ఇటీవల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి ఈ వివాదాస్పద సర్వే నంబర్లలో ఎలాంటి ఆక్రమణలకు పాల్పడవద్దని, భూమి స్వరూపాన్ని మార్చవద్దని (ఆల్టరింగ్ ది నేచర్ అఫ్ ల్యాండ్) తేల్చి చెప్పారు. అయినా సరే, స్థానికంగా ఉన్న అలంకృత రిసార్ట్, బాలాజీ గార్డెన్, రాగి కన్వెన్షన్ వంటి సంస్థల పేరుతో అక్రమార్కులు కోర్టు ఉత్తర్వులను సైతం తుంగలో తొక్కుతూ ప్రహరీ గోడలు, భారీ ఆర్చ్‌లు, ప్రీకాస్ట్ కాంపౌండ్ వాల్స్ నిర్మిస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారని స్థానికులు బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కూల్చివేతలు జరపాల్సిందే:**
**ఎమ్.ఎమ్.సి కమిషనర్ , కలెక్టర్‌కు విజ్ఞప్తి:**
హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం భూమి స్వరూపాన్ని మార్చేలా ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదని బాధితుల ప్రతినిధి పి. రామ్‌గోపాల్ రావు పేర్కొన్నారు.
తూంకుంట ఇటీవల మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం కావడంతో, ఎమ్.ఎమ్.సి కమిషనర్, మేడ్చల్ జిల్లా కలెక్టర్, హెచ్‌ఎమ్‌డీఏ, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై తక్షణమే 'స్టాప్ వర్క్' ఆదేశాలు జారీ చేసి, కూల్చివేతలు చేపట్టి కోట్ల విలువైన శరణార్థుల కస్టోడియన్ భూములను కాపాడాలని బాధితులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.







# టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నట్లా.. లేనట్లా..?

( మొదటి పేజీ తరువాయి )

నాథుడే కరువయ్యారు. సాధారణ ప్రజలు చిన్న ఇల్లు కట్టుకోవాలన్నా లేదా చిన్నపాటి మరమ్మతులు చేయాలన్నా నిబంధనలు, నోటీసుల పేరుతో వేధించే టౌన్ ప్లానింగ్ అధికారులు... ఇక్కడ బహిరంగంగా జరుగుతున్న అక్రమ నిర్మాణం వైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయనే వార్తలు స్థానికంగా జోరుగా వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు అందినప్పుడు కేవలం కంటితుడుపుగా నోటీసులు ఇచ్చి, ఆ తర్వాత నిర్మాణదారులతో చేతులు కలిపి పనులను మళ్లీ మొదలుపెట్టించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఫిర్యాదులు.. పత్రికలలో వార్తలు.. అయినా అక్రమ షెడ్డు నిర్మాణం ఆగదా..?**
అక్రమ షెడ్డు నిర్మాణంపై అనేక సార్లు టౌన్ ప్లానింగ్, డిప్యూటీ కమిషనర్ కి ఫిర్యాదు చేశామని స్థానికులు పేర్కొంటున్నారు. పత్రికల్లో వరుసగా కథనాలు వచ్చినప్పటికీ, ఫిర్యాదులు చేరసినప్పటికీ నిర్మాణ పనులు తిరిగి యదేచ్చగా కొనసాగుతుండటంటౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్షానికి నిదర్శనమని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సాధారణ ప్రజలు చిన్న నిర్మాణం చేపట్టినా అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, భవన నిర్మాణ నిబంధనలు అంటూ పరిశీలనలు చేసే అధికారులు.. జాతీయ రహదారి పక్కనే భారీ షెడ్ నిర్మాణం జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**జోనల్ కమిషనర్ ప్రత్యక్ష జోక్యం చేసుకోవాలని స్థానికుల డిమాండ్... !**
కింది స్థాయి అధికారులు ఇచ్చే అరకొర నివేదికలపైనే ఆధారపడకుండా, జోనల్ కమిషనర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి జోడిమెట్లలో జరుగుతున్న



అక్రమ షెడ్ నిర్మాణాన్ని పరిశీలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

***గత అనుభవాలే నిదర్శనం... అప్పటిలాగే ఇప్పుడూ చర్యలు తీసుకోవాలి!***
గతంలో 'తాజా కిచెన్' పక్కనే ఇదే తరహాలో అక్రమంగా నిర్మించిన షెడ్‌పై ఘట్‌కేసర్ సర్కిల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు నేరుగా ఉప్పల్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేస్తున్నారు. అప్పట్లో ఉన్నతాధికారుల తక్షణ జోక్యంతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగి, సదరు అక్రమ షెడ్డును కూల్చివేయడమే కాకుండా దాన్ని పూర్తిగా సీజ్ చేశారు.ప్రస్తుతం అదే ప్రాంతంలో 'తాజా కిచెన్'కు ఎదురుగా మరో భారీ కమర్షియల్ షెడ్ నిర్మాణం యథేచ్ఛగా కొనసాగుతుండటంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ చర్యలతో తాత్కాలికంగా భయపడిన అక్రమార్కులు, మళ్లీ అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని నిర్మాణాలు జరపడం స్థానిక యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమని స్థానికులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారుల జోక్యంతో అక్రమ నిర్మాణానికి ఏవిధంగానైతే చెక్ పెట్టారో, ఇప్పుడు నిర్మిస్తున్న భారీ షెడ్డుపైనా జోనల్ కమిషనర్ అలాగే తక్షణమే స్పందించాలని అక్రమ షెడ్డు నిర్మాణ పనులను వెంటనే నిలిపి







వేసి షెడ్డును కూల్చివేయడంతో పాటు సీజ్ చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఫామ్ హౌస్ ఫైల్స్

( మొదటి పేజీ తరువాయి )

ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని రేవంత్ రెడ్డి నిలదీశారు. ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతానని, శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి యజమానులను చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పారు.

**నేడు ఎంపీలు, ఎమ్మెల్సీల పర్యటన**
మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం వందలాది ఎకరాల భూములను కబ్జా చేసిందంటూ సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా సంచలన వివరాలు వెల్లడించిన నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది. కల్వకుంట్ల కుటుంబ భూముల వ్యవహారంపై క్షేత్రస్థాయిలోనే తేల్చుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిశ్చయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే శుక్రవారం సిద్ధిపేటలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ ఎంపీలకు, ఎమ్మెల్సీలకు సమాచారం అందించింది. ప్రజాప్రతినిధులు శుక్రవారం ఉదయం 10 గంటలకు అసెంబ్లీ వద్దకు చేరుకోవాలని సూచించింది. సీఎల్పీ పాయింట్ నుంచి కాంగ్రెస్ నేతలందరినీ సిద్ధిపేటకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక బస్సును సిద్ధం ఏర్పాటు చేశారు. సిద్ధిపేట రెవెన్యూ కార్యాలయానికి వెళ్లనున్న కాంగ్రెస్ నేతల బృందం, కేసీఆర్ కుటుంబ భూములకు సంబంధించిన రికార్డులు, పహాణీలు, భూ కేటాయింపు పత్రాలను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. అసెంబ్లీలో సీఎం వెల్లడించిన భూముల లెక్కల ఆధారంగా సిద్ధిపేట రెవెన్యూ ఆఫీస్‌లో రికార్డులు తనిఖీ చేయాలని కాంగ్రెస్ నిర్ణయించడంతో శుక్రవారం ఏం జరుగుతుందోనని ఉత్కంఠగా మారింది.

# ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధం

*** దమ్ముంటే సీఎం సవాల్‌ను స్వీకరించాలి.**
*** కేటీఆర్ డిమాండ్.**

హైదరాబాద్, మహా: కేసీఆర్ పుట్టిన 1954 నుంచి నేటి వరకు, అదేవిధంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఇరు కుటుంబాల ఆస్తులపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించి సిట్టింగ్ జడ్జితో విచారణకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇరు కుటుంబాల ఆస్తులపై నిష్పక్షపాత విచారణ జరగాలని కేటీఆర్ డిమాండ్ చేసినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. తమకు న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రత్యేక దర్యాప్తు బృందాలు కాకుండా హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో విచారణ జరగాలని కోరారు. తమ వైపు ఏదైనా తప్పు బయటపడితే చట్టపరంగా ఎలాంటి శిక్షకైనా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ సవాల్‌ను ముఖ్యమంత్రి స్వీకరించి విచారణకు అంగీకరించాలని డిమాండ్ చేశారు.

**ఫామ్‌హౌస్ భూములపై కేటీఆర్ వాదన**
కేసీఆర్ ఫామ్‌హౌస్ విషయంలో గతంలో వెయ్యి ఎకరాలంటూ ప్రచారం జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి 67 ఎకరాల ప్రస్తావన చేశారని పేర్కొంటూ, మిగిలిన భూములు ఎక్కడ ఉన్నాయో చూపిస్తే వాటిని ప్రభుత్వానికే రాసిస్తామని అన్నారు. కేసీఆర్ ఎన్నికల అఫిడవిట్లలో ఆస్తుల




వివరాలను వెల్లడించారని, వ్యవసాయ భూములకు సంబంధించి ఆదాయపు పన్ను, స్టాంపు డ్యూటీ చెల్లించి రిజిస్ట్రేషన్లు చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రశ్నలు సంధిస్తామన్న భయంతోనే ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. బీజేపీతో కలిసి ముఖ్యమంత్రి అసెంబ్లీని ఏకపక్షంగా నడిపిస్తున్నారని విమర్శించారు. తమపై విధించిన సస్పెన్షన్లను ఎత్తివేసి అసెంబ్లీ సమావేశాలను నెలరోజుల పాటు పొడిగిస్తే ప్రజా సమస్యలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వ హామీల అమలుపై సభలో నిలదీస్తామని అన్నారు.

**సిరిసిల్ల భూములపై శ్వేతపత్రం**
సిరిసిల్ల పట్టణంలో పేదలు, కార్మికులకు దశాబ్దాల క్రితం కేటాయించిన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జా భూములుగా చిత్రీకరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వం జీవోలు 58, 59 ద్వారా పేదల స్థలాలను క్రమబద్ధీకరించి పట్టాలు ఇచ్చిందని పేర్కొన్నారు. సిరిసిల్లలో ఎనిమిది వేల ఎకరాల భూములపై ఆరోపణలు చేస్తున్న ముఖ్యమంత్రి, ఆ భూములు ఎక్కడున్నాయి, ఏ సర్వే నంబర్లలో ఉన్నాయి, ఎవరి ఆధీనంలో ఉన్నాయన్న పూర్తి వివరాలతో అధికారిక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల వ్యవహారంలో ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ కోరారు. 22ఏ నిషేధిత జాబితా విషయంలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలు బీఆర్ఎస్ తరఫున చేసిన రాజకీయ ఆరోపణలేనని, వాటిపై ప్రభుత్వ స్పందన, అధికారిక ఆధారాలు వేర్వేరుగా పరిశీలించాల్సి ఉంటుందని తాజా రాజకీయ పరిణామాలు సూచిస్తున్నాయి. 22ఏ భూముల అంశంపై ప్రభుత్వం కూడా అసెంబ్లీలో వివరణ ఇవ్వనున్నట్లు గతంలో ప్రకటించింది. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ భవనాల కోసం గత ప్రభుత్వం కోకాపేటలో భూములు కేటాయించిందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే తరహాలో బలహీన వర్గాల కోసం భూములు కేటాయించిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో బంజారాహిల్స్‌లో బంజారా భవన్, కొమురం భీమ్ భవనాల నిర్మాణానికి భూములు కేటాయించామని గుర్తుచేశారు. అధికారం మొత్తం ప్రభుత్వ చేతుల్లోనే ఉన్నందున తమ కుటుంబ ఆస్తులపై ఆరోపణలు చేస్తున్న ప్రభుత్వం అధికారిక పత్రాలతో వివరాలు బయటపెట్టాలని కేటీఆర్ అన్నారు. అవసరమైతే శ్వేతపత్రం విడుదల చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. తమపై ఎలాంటి విచారణ జరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## ఎన్డీయే బలం ఐక్యతలోనే ఉంది

**ఏపీ సీఎం చంద్రబాబు**
**మోదీ లాంటి ప్రధాని ఉండడం దేశం చేసుకున్న అదృష్టం**

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో పర్యటించారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా వాద్ నగర్ సేవా సంకల్ప అభియాన్ యాత్రలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, పలువురు కేంద్ర మంత్రులతో కలిసి సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై సీఎం చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. అనంతరం సీఎం చంద్రబాబు తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. 'ఈ రోజు పవిత్ర నగరం కాశీలో జరిగిన వారణాసి వాద్ నగర్ సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నాను. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిదాయకమైన 25 ఏళ్ల నిస్వార్థ సేవా ప్రస్థానాన్ని వేడుకగా జరుపుకోవడం నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది'. ఈ కార్యక్రమానికి ముందు భారత పౌరులందరి శ్రేయస్సు, శాంతిని కోరుతూ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లతో కలిసి శ్రీకాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించాను. ఎన్‌డీఏ ఐక్యత, దేశ ప్రగతి పట్ల ఆంధ్రప్రదేశ్ పూర్తి నిబద్ధతతో ఉంది. మన ఐక్యతే ఎన్డీయే బలం. వికసిత్ భారత్ సాధించడమే మనందరి ఉమ్మడి లక్ష్యం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మోదీ లాంటి ప్రధాని ఉండడం దేశం చేసుకున్న అదృష్టమని చంద్రబాబు తెలిపారు.

# మియాపూర్ జె.పి నగర్‌లో భారీ అక్రమ నిర్మాణం

**అనుమతులకు మించి.. భారీ అంతస్తులు**
**సిఎంసి అధికారుల అండదండలతో.. బిల్డర్ నిబంధనల ఉల్లంఘున**

**మహా శేరిలింగంపల్లి :** సైబరాబాద్ మునిసిపల్ అధికారుల పనితీరును ప్రశ్నించేలా, మియాపూర్ జెపి నగర్ లోని ఓ బిల్డర్ నిబంధనలను పాతరేసి భారీ అక్రమ నిర్మాణానికి తెర లేపాడు. జెపి నగర్ కు వెళ్లే ప్రధాన మార్గం కు ఆనుకొని, ఓ బిల్డర్ కమర్షియల్ భవనాన్ని నిర్మించేందుకు మియాపూర్ సర్కిల్ 48 నుండి నామమాత్రపు నిర్మాణ అనుమతిని పొందారు. ఆ తర్వాత మియాపూర్ సర్కిల్ మున్సిపల్ అధికారుల అండదండలతో, యదేచ్చగా నిబంధనలను పాతరేసి అంతస్తులకొద్దీ, ఆకాశమంత ఎత్తులో అక్రమ నిర్మాణాన్ని చేపడుతున్నారు. ప్రస్తుతం బిల్డర్ చేపడుతున్న అక్రమ నిర్మాణంపై, మియాపూర్ సర్కిల్ మున్సిపల్ అధికారులకు వందలాది ఫిర్యాదులు అందుతున్న చర్యలు, తీసుకునేందుకు మాత్రం ముందుకు రాకపోవడంతో స్థానిక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు అక్రమ నిర్మాణం ఏమాత్రం సహించమని సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ సృజన స్పష్టం చేస్తున్న..



కమిషనర్ నిబంధనలు మియాపూర్ సర్కిల్లో మాత్రం అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, స్పందించి మియాపూర్ జె.పి నగర్ ప్రధాన మార్గంలో సాగుతున్న భారీ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని మియాపూర్ వాసులు కోరుతున్నారు.

## పటేల్ కృషితో హైదరాబాద్ భారత్‌లో విలీనమైంది

**విమోచన వేడుకల్లో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్**

**హైదరాబాద్, మహా :** సర్దార్ వల్లబాయి పటేల్ కృషితో హైదరాబాద్ భారత్ లో విలీనమైందని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ అన్నారు. 2026 సెప్టెంబర్ 17న హైదరాబాద్ పరేగ్ గ్రౌండ్స్ లో కేంద్రం ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. హాజరైన ఉపరాష్ట్రపతి.. పటేల్ పోలీస్ చర్యలతో ఈ ప్రాంతానికి స్వాంతంత్ర్యం వచ్చిందని అన్నారు. తెలంగాణ పోరాట యోధులకు ఘననివాళి అర్పించారు. రాంజీ గోండు, కొమురం భీం సేవలు మరువలేమని కొనియాడారు. 1948 సెప్టెంబర్ 17న ఆపరేషన్ పోలోతో విముక్తి కలిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశ భద్రతకు కేంద్రం మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని, మావో రహిత భారత్ కోసం షా కృషిచేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు పరేడ్ గ్రౌండ్స్ లో విమోచన దినోత్సవ వేడుకల కోసం హైదరాబాద్ వచ్చిన ఉపరాష్ట్రపతిని బేగంపేట ఎయిర్ పోర్టులో స్వాగతం పలికారు మంత్రి పొన్నం ప్రభాకర్, రామచంద్రరావు, డీకే అరుణ, ఇతర బీజేపీ నేతలు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఉపరాష్ట్రపతి .. జాతీయ జెండా ఎగరవేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ గవర్నర్ ప్రతాప్ శుక్లా పాల్గొన్నారు.

# కేసీఆర్ కుటుంబభూములపై విచారణ జరపాలి

**టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ డిమాండ్**

**ఢిల్లీ, మహా :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ ఆస్తులపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్ కుటుంబానికి అంతటి భారీ స్థాయిలో భూములు ఎక్కడి నుంచి వచ్చాయో తేల్చేందుకు సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబానికి చెందిన భూముల వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే బహిర్గతం చేశారని మహేశ్ గౌడ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎన్నికల అఫిడవిట్ల ప్రకారం, 200V9లో కేసీఆర్‌కు ఎలాంటి భూమి లేదని, 2014 నాటికి 35 ఎకరాలు ఉండగా, 2018 నాటికి ఆ విస్తీర్ణం మరింత పెరిగిందని తెలిపారు. 2023 నాటికి కేసీఆర్ పేరిట 53 ఎకరాలు ఉండగా, కేటీఆర్ మరో 67 ఎకరాలు కొనుగోలు చేశారని వివరించారు. మొత్తంగా 2023 నాటికే ఆ కుటుంబం పేరిట 123 ఎకరాలు భూమి ఉందని పేర్కొన్నారు. అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులకు, వాస్తవాలకు మధ్య భారీ వ్యత్యాసాలు



ఉన్నాయని ఆయన ఆరోపించారు. భూములకు సంబంధించిన "22ఏ" వివాదంపై కూడా ప్రస్తుతం విచారణ జరుగుతోందని వెల్లడించారు. ఇదే క్రమంలో బీఆర్ఎస్ నేతల తీరుపై ఆయన నిప్పులు చెరిగారు. స్పీకర్ తల్లిని ఉద్దేశించి వారు వాడిన అనుచిత భాషను, పోలీసుల పట్ల వారి ప్రవర్తనను తీవ్రంగా తప్పుపట్టారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలను ఆయన ఖండించారు. వీడియోలను పరిశీలిస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉద్దేశపూర్వకంగా దూకుడుగా వ్యవహరించినట్లు స్పష్టమవుతోందన్నారు.

# నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో ఆధునిక తెలంగాణ నిర్మాణం

( మొదటి పేజీ తరువాయి )

కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యాలని వివరించారు.

**పోరాట స్ఫూర్తితో ప్రజాపాలన**

తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు ముఖ్యమంత్రి ఘన నివాళులు అర్పించారు. తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అని పేర్కొన్నారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు తెలంగాణ పుట్టినిల్లు అని అన్నారు.

**ప్రజా పాలనకు నాలుగు పునాదులు**

అభివృద్ధి, సంక్షేమంతోపాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం ప్రజా పాలనకు పునాదులని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రజా పాలన అంటే ప్రజల మాటకు విలువ ఇవ్వడం, వారి సమస్యలకు పరిష్కారం చూపడం, హక్కులను కాపాడడం, ప్రభుత్వ వనరులు అందరికీ చేరేలా చూడటమని వివరించారు. చారిత్రక పోరాటాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాల్సిన అవసరం ఉందన్నారు.

**తలసరి ఆదాయం రూ.4,18,931**

తెలంగాణ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంతో పోటీ పడుతోందని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది దేశ తలసరి ఆదాయం కంటే దాదాపు 91 శాతం అధికమని పేర్కొన్నారు. అభివృద్ధి కేవలం గణాంకాల్లో కాకుండా ప్రజల జీవన ప్రమాణాల్లో కనిపించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

**రైతు కుటుంబాలకు రుణమాఫీ**

రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశామని, రూ.20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలను రుణభారం నుంచి బయటపడేశామని చెప్పారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశామని, సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించామని తెలిపారు. గతంలోనూ ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.36 వేల కోట్ల చెల్లింపులు పూర్తిచేసినట్లు అధికారికంగా వెల్లడించింది.

**వ్యవసాయానికి రూ.1.72 లక్షల కోట్లు**

32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1.72 లక్షల కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ మద్దతుతో వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని ఆయన అన్నారు. భూ భారతి చట్టంతో భూ పరిపాలనలో సంస్కరణలు తీసుకొచ్చామని, భూధార్, కృత్రిమ మేధ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించామని తెలిపారు. 5.94 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేశామని చెప్పారు.

**కృష్ణా జలాల వాటా కోసం న్యాయపోరాటం**

కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం న్యాయపోరాటం కొనసాగిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల పథకం, శ్రీశైలం ఎడమ కాలువ సొరంగం తదితర పెండింగ్ ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా**

తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ ఆత్మగౌరవంతో, ఆర్థిక స్వాతంత్ర్యంతో జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, దీని ద్వారా మహిళలకు రూ.12,385 కోట్ల మేర ప్రయాణ వ్యయం ఆదా అయిందని పేర్కొన్నారు.

**గృహజ్యోతి.. రూ.500కే వంటగ్యాస్**

గృహజ్యోతి పథకం కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. 43 లక్షల కుటుంబాలకు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా 1.68 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.4,709 కోట్ల సహాయం అందించామని పేర్కొన్నారు.

**స్వయం సహాయక సంఘాలకు భారీ రుణాలు**

4.54 లక్షల స్వయం సహాయక సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంకు అనుసంధాన రుణాలు, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించామని ముఖ్యమంత్రి తెలిపారు. మహిళా మార్టులు, పెట్రోలు బంకులు, ఆర్టీసీ అద్దె బస్సుల ద్వారా మహిళల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

**3.42 కోట్ల మందికి సన్నబియ్యం**

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. 15 లక్షలకు పైగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశామని చెప్పారు. 43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందుతున్నాయని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల కింద సుమారు రూ.31 వేల కోట్లు అందించామని పేర్కొన్నారు. మరో 2.25 లక్షల మందికి పింఛన్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

**ఏడు లక్షల ఇళ్ల దిశగా అడుగులు**

ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో నివసించాలన్నదే ప్రభుత్వ ఆశయమని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు అందిస్తున్నామని తెలిపారు. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణం ప్రారంభించామని పేర్కొన్నారు.

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులు**

సామాజిక అంతరాలను తగ్గించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే నిర్వహించామని రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్వే గణాంకాల ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపామని చెప్పారు.

**ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం**

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ చేపట్టామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఫిబ్రవరి 4ను ప్రతి ఏటా తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయం తమకు నినాదం కాదని, వెనుకబడిన వర్గాలను ముందుకు తీసుకురావడమే దాని లక్ష్యమని అన్నారు.

**విద్య, వైద్యం రెండు కళ్లలా**

ప్రజా ప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కళ్ల వంటివని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా సమగ్ర గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో అన్ని వసతులతో వీటిని నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించామని, ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు.

**11 లక్షల మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం, పాలు అందించేందుకు రూ.927 కోట్లు ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. మధ్యాహ్న భోజన పథకాన్ని 12వ తరగతి వరకు విస్తరించామని తెలిపారు. 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. విద్యా రంగంలో తీసుకున్న చర్యలతో పనితీరు సూచీలో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందని పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు

ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌కు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. నార్త్‌ఈస్టర్న్ విశ్వవిద్యాలయంతోపాటు యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశాయని చెప్పారు. అంతర్జాతీయ విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలతో హైదరాబాద్‌ను జ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను ఆయన వివరించారు. తెలంగాణ ప్రభుత్వం అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను రాష్ట్రానికి తీసుకురావడంపై ఇప్పటికే తన లక్ష్యాలను వెల్లడించింది.

ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు

ఆరోగ్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5.19 లక్షల మందికి రూ.2,526 కోట్ల సహాయం అందించామని పేర్కొన్నారు. సామాన్యులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్న లక్ష్యంతో గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు.

టిమ్స్ ఆసుపత్రుల విస్తరణ

సనత్‌నగర్‌లో మర్రి చెన్నారెడ్డి టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించామని రేవంత్‌రెడ్డి చెప్పారు. అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ ఆసుపత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. వరంగల్‌లో 2 వేల పడకల సామర్థ్యంతో టిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

72 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు

తెలంగాణ ఉద్యమంలో యువత కీలక పాత్ర పోషించిందని ముఖ్యమంత్రి అన్నారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం పోరాడిన యువతకు అవకాశాలు కల్పించేందుకు 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా పూర్తి చేశామని తెలిపారు. గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు పరీక్షలను పారదర్శకంగా నిర్వహించామని చెప్పారు.

**నైపుణ్యాలకు పెద్దపీట**

కృత్రిమ మేధ కారణంగా ఉద్యోగాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోందని రేవంత్‌రెడ్డి అన్నారు. అందుకే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశామని, అక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని తెలిపారు.



మెట్రో రెండో దశకు రూ.38,595 కోట్ల ప్రతిపాదనలు

రాష్ట్ర మౌలిక వసతులను వేగంగా విస్తరిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రూ.38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాలకు అనుమతులు సాధించి, అవసరమైన భూసేకరణ చేపట్టామని పేర్కొన్నారు.

**55 కిలోమీటర్ల మూసీ పునరుజ్జీవనం**

హైదరాబాద్ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలనే లక్ష్యంతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును ప్రారంభించామని రేవంత్‌రెడ్డి తెలిపారు. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేసే చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

కల్తీ ఆహారం, మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు

ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ముఖ్యమంత్రి అన్నారు. ఇందుకోసం టీజీ సేఫ్ వ్యవస్థను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ఈగల్ వ్యవస్థను పటిష్ఠం చేశామని పేర్కొన్నారు.

**మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం**

ప్రస్తుత అవసరాలను తీర్చడమే కాకుండా భవిష్యత్ తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల మేరకు 2047 నాటికి రాష్ట్రాన్ని మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని తెలిపారు. దేశ స్థూల దేశీయోత్పత్తిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. ఈ మూడు లక్షల కోట్ల డాలర్ల లక్ష్యాన్ని ప్రభుత్వం తన దీర్ఘకాలిక దృష్టిపత్రంలోనూ పేర్కొంది.

**భారత్ ఫ్యూచర్ సిటీపై భారీ ఆశలు**

దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్-జీరో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. డిసెంబరులో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ ప్రపంచ సదస్సు సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తామని చెప్పారు. టీసీఎస్ రూ.70 వేల కోట్ల పెట్టుబడితో భారీ కృత్రిమ మేధ డేటా కేంద్రాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చిందని, అమెజాన్ కూడా భారీ పెట్టుబడితో డేటా కేంద్ర నిర్మాణాన్ని చేపట్టిందని తెలిపారు. టీసీఎస్-హైపర్‌వాల్ట్ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం కూడా రాష్ట్ర భవిష్యత్ ఆర్థిక వ్యవస్థలో కీలక ప్రాజెక్టుగా పేర్కొంది.

**ప్రత్యేక కేంద్రాలతో ఫ్యూచర్ సిటీ**

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, జీవశాస్త్ర పరిశోధనల కేంద్రం, విద్యుత్ వాహనాల పార్కు, కృత్రిమ మేధ నగరం, ఆరోగ్య నగరం, విద్యా నగరం వంటి ప్రత్యేక విభాగాలతో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రాంతీయ రహదారి వలయం, గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారులు, డ్రైపోర్టులు, హైదరాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్లు రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే మౌలిక వసతులుగా నిలుస్తాయని అన్నారు.

**రూ.19,294 కోట్లతో రహదారి పనులు**

గ్రామం నుంచి మండలానికి, మండలం నుంచి జిల్లాకు, జిల్లా నుంచి రాజధానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రహదారులు అభివృద్ధికి సూచికలని పేర్కొంటూ ఆర్‌అండ్‌బీ పరిధిలో రూ.13 వేల కోట్లు, పంచాయతీరాజ్ పరిధిలో రూ.6,294 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నామని చెప్పారు.

**వర్షా భావ పరిస్థితులపై ముందస్తు చర్యలు**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, అదే సమయంలో విద్యుత్ డిమాండ్ కూడా పెరిగిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల సహకారం కూడా అవసరమని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఎక్కువ పని దినాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**ప్రజల భాగస్వామ్యమే లక్ష్యం**

తెలంగాణ పోరాట స్ఫూర్తిని ఆధారంగా చేసుకుని ఆధునిక తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం సమన్వయంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని, నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో ప్రపంచం గర్వించే తెలంగాణను నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# కేటీఆర్ పీఆర్వో మహేష్ అరెస్టు

**పోలీసుల విధులకు ఆటంకం**

**బొల్లారం లో ఏసీపీని తోసేసిన మహేష్**



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఆర్వో మహేష్ మణిక్యను బొల్లారం పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. సెప్టెంబరు 8న హాకీంపేట-బొల్లారం చెక్‌పోస్టు వద్ద పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు, విధుల్లో ఉన్న అధికారితో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై ఆయనపై కేసు నమోదైంది. భారతీయ న్యాయ సంహితలోని 132, 223 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**ఎర్రవల్లి వెళ్లే క్రమంలో ఏసీపీతో వాగ్వాదం**

సెప్టెంబరు 8న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వైపు వెళ్తున్న కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు హాకీంపేట వద్ద అడ్డుకున్నారు. ఫామ్‌హౌస్ పరిసరాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని, అక్కడికి వెళ్లవద్దని పోలీసులు సూచించినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బొల్లారం చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉన్న బేగంపేట ఏసీపీ ఆర్. గోపాలకృష్ణమూర్తి, ఇతర పోలీసు అధికారులు బీఆర్ఎస్ నాయకుల వాహనాలను నిలిపి పరిస్థితిని వివరించినట్లు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమయంలో కేటీఆర్ పీఆర్వో మహేష్ ఏసీపీతో వాగ్వాదానికి దిగారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని పోలీసులు ఆరోపించారు. ఈ క్రమంలో మహేష్ ఏసీపీని తోసివేశారని, దాంతో ఆయన కిందపడిపోయారని పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

**రెండు సెక్షన్ల కింద కేసు**

ఈ ఘటనపై బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ ఫిర్యాదు చేశారు. దీంతో మహేష్‌పై భారతీయ న్యాయ సంహితలోని 132, 223 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం, అధికారుల ఆదేశాలను ఉల్లంఘించడం వంటి అంశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. కేటీఆర్ పీఏ మహేందర్‌రెడ్డి, పీఆర్వో మహేష్ మాణిక్యలు సెప్టెంబరు 7న అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనకు సంబంధించిన కేసులోనూ పోలీసుల విచారణను ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో వారిని అరెస్టు చేయకుండా తెలంగాణ హైకోర్టు సెప్టెంబరు 11న మధ్యంతర రక్షణ కల్పించింది. అయితే దర్యాప్తు కొనసాగించేందుకు పోలీసులకు అనుమతి ఇచ్చింది. ఈ వ్యవహారంపై తదుపరి విచారణ సెప్టెంబరు 21న జరగనుంది.

**సైఫాబాద్ ఘటనపై మరో వివాదం**

ఇదిలా ఉండగా, సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో తన పీఏ, పీఆర్వోపై కొందరు దాడి చేశారని కేటీఆర్ సెప్టెంబరు 15న ఆరోపించారు. ఈ ఆరోపణలను పోలీసులు తొలుత ఖండిస్తూ, స్టేషన్‌లో దాడి జరగలేదని పేర్కొన్నారు. అనంతరం ఈ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో విచారణ సందర్భంగా స్టేషన్‌లో ఒక ఘటన జరిగినట్లు ప్రభుత్వం తెలిపినట్లు సమాచారం. దీనికి సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలను భద్రపరచాలని హైకోర్టు ఆదేశించినట్లు నివేదికలు వెల్లడించాయి.

# మీనాక్షి నటరాజన్‌పై మళ్లీ న్యాయపోరాటం

- **విదేశీ పర్యటనకు అడ్డుకట్ట వేయాలంటూ కోర్టును ఆశ్రయించిన శ్రీలత.**
- **రాజ్యసభ నామినేషన్ వివాదం తర్వాత మరోసారి తెరపైకి కేసు.**

హైదరాబాద్, మహా: తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి, కాంగ్రెస్ సీనియర్ నేత మీనాక్షి నటరాజన్ చుట్టూ న్యాయపరమైన వివాదాలు కొనసాగుతున్నాయి. ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లేందుకు ఆమె సిద్ధమవుతున్నారన్న ప్రచారం నేపథ్యంలో, విదేశాలకు వెళ్లకుండా ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శ్రీలత మరోసారి న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. మీనాక్షిపై పెండింగ్‌లో ఉన్న కేసుల నేపథ్యంలో ఆమె పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుని విదేశీ ప్రయాణాన్ని నిలిపివేయాలని పిటిషన్‌లో కోరినట్లు తెలుస్తోంది.

**శ్రీలత పిటిషన్‌తో కొత్త పరిణామం**

కాంగ్రెస్ నేత కంభం శివకుమార్‌రెడ్డిపై గతంలో ఆరోపణలు చేసిన శ్రీలత ఈ వ్యవహారంలో మీనాక్షి నటరాజన్ సహా పలువురు కాంగ్రెస్ నేతలపై న్యాయపోరాటం చేస్తున్నారు. గతంలో నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను ఆ కోర్టు తన పరిధిలోకి రాదంటూ తిరిగి ఇచ్చింది. ప్రజాప్రతినిధులకు సంబంధించిన కేసులను విచారించే ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించినట్లు అప్పటి నివేదికలు వెల్లడించాయి.

**ప్రజాప్రతినిధుల కోర్టులో పిటిషన్**

తదుపరి శ్రీలత ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. మీనాక్షి నటరాజన్‌తోపాటు పలువురిని ప్రతివాదులుగా పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ వ్యవహారంలో ఆరోపణలు, ప్రతివాదుల వైఖరి, న్యాయస్థానం ముందు సమర్పించే ఆధారాలు తదుపరి విచారణలో తేలాల్సి ఉంది.

**రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు ఇదే కేసు నేపథ్యం**

మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్‌ను జూన్ 9న రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. ఆమె దాఖలు చేసిన నమూనా-26 అఫిడవిట్‌లో తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిగా వెల్లడించలేదన్న అభ్యంతరాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక ఉత్తర్వులో పేర్కొన్నారు.

**సుప్రీంకోర్టులోనూ ఊరట లభించలేదు**

నామినేషన్ తిరస్కరణను సవాల్ చేస్తూ మీనాక్షి నటరాజన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే జూన్ 12న సుప్రీంకోర్టు ఆమె పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేదు. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో న్యాయస్థానాల జోక్యానికి రాజ్యాంగంలోని నిబంధనలు పరిమితులు విధిస్తున్నాయని ధర్మాసనం పేర్కొంది. అయితే ఎన్నికల పిటిషన్ ద్వారా తగిన న్యాయపరిహారం కోరుకునే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

**కేసు ఆరోపణలు ఇంకా న్యాయస్థానం పరిధిలోనే**

మీనాక్షి నటరాజన్‌పై కేసుకు సంబంధించిన ఆరోపణలు న్యాయస్థానంలో తుది నిర్ధారణ పొందిన అంశాలు కావు. రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు సంబంధించి రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయం మాత్రం తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న కేసు వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదన్న అభ్యంతరంపై ఆధారపడింది. మరోవైపు కాంగ్రెస్ తరఫున అప్పట్లో ఈ ఆరోపణలను వ్యతిరేకిస్తూ, కేసు వివరాలను అఫిడవిట్‌లో పేర్కొనాల్సిన అవసరం లేదన్న వాదన వినిపించింది.

**విదేశీ ప్రయాణంపై పిటిషన్‌తో ఆసక్తి**

ఈ నేపథ్యంలో ఉన్నత విద్య కోసం మీనాక్షి నటరాజన్ విదేశాలకు వెళ్లనున్నారన్న వార్తల మధ్య ఆమె పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుని విదేశీ ప్రయాణాన్ని నిలిపివేయాలంటూ శ్రీలత కోరినట్లు వచ్చిన సమాచారం రాజకీయ, న్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ తాజా అభ్యర్థనపై న్యాయస్థానం ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది తదుపరి విచారణలో స్పష్టమవుతుంది.

**న్యాయపరమైన పరిణామాలపై ఉత్కంఠ**

ఒకవైపు తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా మీనాక్షి నటరాజన్ రాజకీయ బాధ్యతలు నిర్వహిస్తుండగా, మరోవైపు ఆమెకు సంబంధించిన కేసులు, రాజ్యసభ నామినేషన్ వివాదం, తాజాగా విదేశీ ప్రయాణంపై వచ్చిన పిటిషన్ వరుస పరిణామాలకు దారితీస్తున్నాయి. ఈ అంశాల్లో తుది నిర్ణయాలు సంబంధిత న్యాయస్థానాల విచారణ, ఉత్తర్వులపైనే ఆధారపడి ఉంటాయి.

# హైదరాబాద్‌లో డిసెంబరు నుంచి హార్వర్డ్ ఎగ్జిక్యూటివ్ విద్య



**హైదరాబాద్, మహా:** ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో ఔత్సాహికులు, వృత్తి నిపుణుల కోసం ఎగ్జిక్యూటివ్ విద్యా కార్యక్రమాలను డిసెంబరు నుంచి నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణను ప్రపంచస్థాయి జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని అన్నారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో యూకే బిజినెస్ స్కూళ్ల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ఈ వివరాలు వెల్లడించారు.

**యూకే విద్యా ప్రతినిధులతో భేటీ**

యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు కరణ్ బిలిమోరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూళ్ల ప్రతినిధులు, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ ప్రతినిధులతోపాటు వివిధ యూకే విశ్వవిద్యాలయాలకు చెందిన సుమారు 30 మంది ప్రతినిధులు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచస్థాయి విద్యా సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**ప్రముఖ విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాలు**

హార్వర్డ్, ఎంఐటీ, పర్డ్యూ, లండన్ విశ్వవిద్యాలయం, వర్జీనియా టెక్, నార్త్‌ఈస్టర్న్ విశ్వవిద్యాలయం వంటి అంతర్జాతీయ విద్యా సంస్థలతో ఎగ్జిక్యూటివ్ కార్యక్రమాలు, ద్వంద్వ పట్టా కోర్సులు, అధ్యాపకుల శిక్షణ, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యాలను విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ విద్యా కార్యకలాపాలు, ప్రాంగణాల ఏర్పాటుపై ముందుకు వస్తున్నాయని చెప్పారు. యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ప్రాంగణం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే.

**స్థానిక విద్యార్థులకు అంతర్జాతీయ అవకాశాలు**

విదేశీ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌కు రావడం వల్ల స్థానిక విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలతో కలిసి పరిశోధనలు నిర్వహించేందుకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు, అధ్యాపకులకు అంతర్జాతీయ సంస్థలతో అనుసంధానం, ప్రపంచస్థాయి అనుభవం, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఇంగ్లిష్, జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల నైపుణ్యాలను పెంచేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**ఫ్యూచర్ సిటీలో నైపుణ్యాల విశ్వవిద్యాలయం**

మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు అత్యాధునిక నైపుణ్యాలను అందించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. సుమారు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని, విద్య, ఆరోగ్యం, కృత్రిమ మేధ, జీవవిజ్ఞానం, క్రీడలు, డేటా కేంద్రాలు తదితర రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో విద్యా కేంద్రం ఏర్పాటైతే భావితరాలకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.

డిసెంబరులో ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సు

డిసెంబరులో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ ప్రపంచ సదస్సుకు యూకే విద్యా సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక తరహాలో సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో భారీ పెట్టుబడులకు అంతర్జాతీయ సంస్థలు ముందుకు వస్తున్నాయని చెప్పారు.

**రూ.70 వేల కోట్ల టీసీఎస్ ప్రాజెక్టు**

ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ రూ.70 వేల కోట్ల పెట్టుబడితో భారీ కృత్రిమ మేధ డేటా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో, ఒక గిగావాట్ సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు ఏడు వేల ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం తెలిపింది.

**అమెజాన్ భారీ పెట్టుబడులు**

భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా కేంద్రం నిర్మాణాన్ని ఇప్పటికే ప్రారంభించిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. వచ్చే 14 ఏళ్లలో ఏడు బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టే ప్రణాళికను అమెజాన్ ప్రకటించిందని ప్రభుత్వం వెల్లడించింది. తెలంగాణలో మొత్తం పెట్టుబడులను లక్ష కోట్ల రూపాయల స్థాయికి తీసుకెళ్లాలని సంస్థను కోరినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

ఫార్చ్యూన్ 500 సంస్థలకు కేంద్రంగా తెలంగాణ

ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, ఫార్చ్యూన్ 500 సంస్థలు తెలంగాణలో కార్యకలాపాలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి అన్నారు. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు, నైపుణ్య విశ్వవిద్యాలయాలు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా యువతలో నైపుణ్యాలను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

**లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం**

తెలంగాణను 2034 నాటికి ఒక లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని ముఖ్యమంత్రి ప్రతినిధి బృందానికి వివరించారు. ప్రపంచస్థాయి విద్యాసంస్థలు, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలను ఒకే పర్యావరణ వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్య, పరిశోధన, నైపుణ్యాల కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. ఈ ఆర్థిక లక్ష్యాలను తెలంగాణ ప్రభుత్వం గతంలోనూ అధికారికంగా ప్రకటించింది.

# ఎర్రవల్లి భూదందా బట్టబయలు



రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాకపోవచ్చు కానీ, ఆ పదవులు తెచ్చిపెట్టే పరిణామాలు మాత్రం దశాబ్దాల పాటు వెంటాడుతూనే ఉంటాయి. ఒకప్పుడు రాష్ట్ర రాజకీయాలను శాసించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు ఇప్పుడు తన ఎర్రవల్లి ఫాంహౌస్ రూపంలో పెను సవాల్ ఎదురవుతోంది. శాసనసభ వేదికగా సెక్షన్ 22ఏ భూములపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. అలుపెరగని పోరాటాలతో రాష్ట్రాన్ని సాధించిన నాయకుడి ఆస్తుల లెక్కలు ఇప్పుడు అఫిడవిట్ల సాక్షిగా, రెవెన్యూ రికార్డుల వేదికగా అగ్నిపరీక్షను ఎదుర్కొంటున్నాయి. కాలం గిర్రున తిరిగే సరికి ఆస్తుల తక్కెడలో వచ్చిన మార్పులు సామాన్యులను సైతం విస్మయానికి గురిచేస్తున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెరపైకి తెచ్చిన ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా చూస్తే, కరీంనగర్ లోక్‌సభ బరిలో నిలిచిన 2004 నాటికి కేసీఆర్ పేరిట వ్యవసాయ భూమి ఏదీ లేదు. అప్పటి అఫిడవిట్ కారం కేవలం బంజారాహిల్స్‌లోని 70 లక్షల రూపాయల భవనం సహా మొత్తం ప్రకటించిన ఆస్తుల విలువ సుమారు 8.44 లక్షల రూపాయలు మాత్రమే. కానీ, అధికార సోపానాలు ఎక్కుతున్న కొద్దీ ఈ అంకెల్లో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. 2009 నాటికి సుమారు 2.27 కోట్ల రూపాయలకు చేరిన ఆయన ఆస్తుల విలువ, 2014 మెదక్ లోక్‌సభ ఎన్నికల నాటికి ఎర్రవల్లి పరిధిలోని 37.70 ఎకరాల వ్యవసాయ భూమితో కలుపుకుని 15.16 కోట్ల రూపాయలకు ఎగబాకింది. ఈ ప్రస్థానం అక్కడితో ఆగలేదు. 2018 నాటికి 23.55 కోట్ల రూపాయలుగా ఉన్న మొత్తం ఆస్తుల విలువ, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (మై నేతా) సమాచారం ప్రకారం 2023 నాటికి ఏకంగా 58.93 కోట్ల రూపాయలకు చేరుకుంది.

కేవలం ఆస్తుల పెరుగుదలే ఇప్పుడు అసలు సమస్య కాదు, ఆ ఆస్తుల వెనుక ఉన్న భూముల మూలాలే ప్రస్తుత రాజకీయ తుఫానుకు కేంద్ర బిందువు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో ప్రస్తావించిన వివరాల ప్రకారం, కేసీఆర్ అధీనంలోని ఎర్రవల్లి ఫాంహౌస్ సుమారు 700 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇందులో సర్వే నంబరు 325 పరిధిలోనే సుమారు 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నది ప్రధాన ఆరోపణ. అంతేకాకుండా, సర్వే నంబరు 1944 పరిధిలో ఎర్రవల్లి-శివర్ వెంకటాపురం గ్రామాల సరిహద్దులకు సంబంధించి సుమారు 295 ఎకరాలపై పాత వివాదం కొనసాగుతోంది. ఈ ఆరోపణల నేపథ్యంలోనే ఎంత భూమి వ్యక్తిగత యాజమాన్యంలో ఉంది, ఎంత ప్రభుత్వ భూమి ఉందనేది నిర్ధారించడానికి రెవెన్యూ అధికారులకు ముఖ్యమంత్రి 30 రోజుల గడువు విధించారు. ఒకవేళ ఆ భూమి ప్రభుత్వానిదే అని తేలితే, దానిని స్వాధీనం చేసుకుని సుమారు 800 దళిత కుటుంబాలకు అర ఎకరం చొప్పున పంచుతామని సభలో ఆయన చేసిన ప్రకటన రాజకీయంగా వ్యూహాత్మక అడుగుగా చెప్పవచ్చు.

అయితే, ఒక నాణేనికి రెండు ముఖాలు ఉన్నట్లుగానే ఈ వ్యవహారంలో చట్టపరమైన, తార్కికమైన కోణాలను విస్మరించలేము. కేవలం అఫిడవిట్లలో ఆస్తుల విలువ పెరగడం లేదా ఒక ఎన్నిక నుంచి మరో ఎన్నికకు భూములు కొనుగోలు చేయడం మాత్రమే అక్రమ సంపాదనకు రుజువులు కాలేవు. భూమి కొనుగోలు మూలాలు, చెల్లింపు విధానాలు, యాజమాన్య హక్కులు, ప్రభుత్వ భూమితో మేళవింపు జరిగిందా లేదా తదితర అంశాలను దర్యాప్తు సంస్థలు, రెవెన్యూ రికార్డులు చట్టబద్ధంగా తేల్చాల్సి ఉంటుంది. మరోవైపు ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ సైతం దీటుగానే బదులిస్తోంది. ఆస్తుల వివరాలను ఎన్నికల సమయంలో అఫిడవిట్లలో పారదర్శకంగానే ప్రకటించామని వాదిస్తున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, రెండు కుటుంబాల ఆస్తులపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ జరగాలని సవాల్ విసరడం ఈ పోరుకు మరింత ఆజ్యం పోసింది.

మొత్తం మీద, సెప్టెంబరు 16న శాసనసభ సాక్షిగా రాజుకున్న ఈ వివాదం ఇప్పుడు రాజకీయ ఆరోపణల దశను దాటి రెవెన్యూ యంత్రాంగం పరిశీలన దశకు చేరుకుంది. ఎర్రవల్లి భూములను పరిశీలించేందుకు పంపిన వాస్తవ నిర్ధారణ బృందం, జిల్లా కలెక్టర్ సమర్పించబోయే నివేదికే ఈ రాజకీయ నాటకంలో క్లైమాక్స్‌ను నిర్ణయించనుంది. అఫిడవిట్లలో ఉన్న కాగితపు లెక్కలు చట్టపరమైన కొలబద్దలపై నిలబడతాయా, లేక కేవలం రాజకీయ ఆరోపణలుగానే మిగిలిపోతాయా అనేది తేలాలంటే ఈ 30 రోజుల గడువు ముగిసేవరకు వేచి చూడక తప్పదు. రికార్డులు మాట్లాడినప్పుడే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయి, ఆ క్షణం కోసమే ఇప్పుడు యావత్ తెలంగాణ సమాజం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.

**గడల నరసింహారావు,**
**అసోసియేట్ ఎడిటర్, మహాపత్రిక**

# ఇరాన్ వార్ తో అమెరికా కొంపకొల్లేరు



ఇరాన్ తో పొత్తు పెట్టుకుని అమెరికా కొంప కొల్లేరు చేసుకుంది. పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయింది. పశ్చిమాసియాలో ఇరాన్‌తో చేస్తున్న యుద్ధం అమెరికాకు తీవ్ర ఆర్థిక భారంగా మారుతోంది. 2026 ఆగస్టు నాటికి అమెరికా రక్షణ శాఖ ఈ యుద్ధం కోసం సుమారు 38 బిలియన్ డాలర్లు (సుమారు రూ.3.65 లక్షల కోట్లు) మేర ఖర్చు చేసినట్లు కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ (సీబీఓ) తాజా నివేదికలో పేర్కొంది. ఒక వేళ యుద్ధం తీవ్రత జులై నాటి స్థాయికి పెరిగితే, అమెరికా నెలవారీ యుద్ధ ఖర్చు 3 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. సీబీఓ అనేది అమెరికా కాంగ్రెస్‌కు, బడ్జెట్, ఆర్థిక విశ్లేషణలు అందించే ఒక నిష్పాక్షిక సంస్థ. ఇది తాజాగా "ఇరాన్ పై అమెరికా సైనిక చర్యల ఖర్చు అంచనా" అనే పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. అందులో ఇరాన్ తో యుద్ధానికి సంబంధించిన ఖర్చులను నాలుగు విభాగాలుగా చూపించింది. రక్షణ శాఖ కార్యకలాపాలు, రవాణా, నిర్వహణ ఖర్చులు; ఒకదాని కోసం కేటాయించినవి మరొకదానికి వాడడం వల్ల కలిగే నష్టం, సరఫరా అంతరాయాలు, ధరల పెరుగుదల వల్ల కలిగే ఆర్థిక నష్టాలు, దౌత్యపరమైన చర్యలు, విదేశీ సాయం వంటి అదనపు ఖర్చులు ఇలా ఎన్నో ఉదహరించింది. అమెరికా రక్షణ శాఖ ఖర్చు చేసిన 38 బిలియన్ డాలర్లలో ఎక్కువ భాగం, యుద్ధంలో వాడేసిన మందుగుండు సామగ్రిని, నష్టపోయిన ఆయుధాలను మళ్లీ భర్తీ చేసుకోవడానికి ఖర్చు అయ్యింది. యుద్ధ విమానాల మోహరింపు, ఇంధనం ఖర్చు కూడా ఇందులో భాగంగా ఉంది. వాస్తవానికి యుద్ధం ప్రారంభమైన మొదట్లో ఘర్షణలు చాలా తీవ్రంగా జరిగాయి. ప్రస్తుతం తక్కువ తీవ్రతతో నామమాత్రంగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఒకవేళ మే, జూన్ నెలల తరహాలోనే మళ్లీ ఘర్షణలు తీవ్రమైతే, అమెరికా అదనంగా నెలకు 2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.19.182 కోట్లు) ఖర్చు అయ్యే అవకాశం ఉంది. అదే ఈ ఘర్షణలు జులై నాటి తీవ్రతకు పెరిగితే ఆ ఖర్చు నెలకు 3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.28,773 కోట్లు)కు చేరుతుంది. యుద్ధం తీవ్రత మరింత పెరిగితే ఆ ఖర్చులు ఇంకా పెరగవచ్చు. రక్షణ శాఖ మాకు అవసరమైన సమాచారాన్ని అందించకపోవడం వల్ల, ప్రభుత్వ డేటాబేస్లు, బహిరంగ నివేదికల ఆధారంగా ఈ అంచనాలు వేశాం" అని సీబీఓ పేర్కొంది. జూన్‌లో ట్రంప్ ప్రభుత్వం 87.6 బిలియన్ డాలర్ల అదనపు నిధులు కోరింది.అందులో రక్షణ శాఖకు సంబంధించినవే 67.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో ఇరాన్‌తో యుద్ధానికి కేటాయించినవి 42.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇది సీబీఓ అంచా వేసిన ఖర్చు కంటే 10 శాతం ఎక్కువ కావడం గమనార్హం. మొత్తంగా ఇజ్రాయెల్ కోసం ఇరాన్ పై ముందు వెనుకా ఆలోచించకుండా యుద్ధం చేసి అమెరికాను కష్టాల్లోకి నెట్టేశాడు ట్రంప్. ఇరాన్ వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం వల్ల హర్మూజ్ జలసంధి, ఎర్ర సముద్రం ద్వారా జరిగే చమురు, సహజవాయువు రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు, పెట్రోల్, డీజిల్, జెట్ ఫ్యూయెల్ ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఇంధన ధరల పెరుగుదల వల్ల 2027 మొదటి త్రైమాసికంలో వినియోగ వస్తువుల ధరలు (పీసీఈ) ద్రవ్యోల్బణం మునుపటి అంచనాల కంటే 0.5 శాతం, కోర్ పీసీఈ ద్రవ్యోల్బణం 0.3 శాతం మేర పెరగవచ్చని భావిస్తున్నారు. ఈ ప్రభావం అమెరికా ట్రెజరీ వడ్డీ రేట్లపై కూడా పడే అవకాశం ఉందని, 2026లో మూడు నెలల ట్రెజరీ బిల్లు రేట్లు 0.2 శాతం వరకు పెరగవచ్చని సీబీఓ అంచనా వేసింది. తాజాగా వైట్ హౌజ్ సూచనలు పట్టించుకోకుండా వడ్డీరేట్లు పెంచేసింది.

# చిప్ తయారీలో భారత్‌కు ఇదే కీలక మలుపు



**న్యూఢిల్లీ, మహా:**
ప్రపంచ సెమీకండక్టర్ రంగంలో భారత్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా కీలక అడుగు వేసింది. న్యూఢిల్లీలోని యశోభూమిలో గురువారం ప్రారంభమైన ఐదో సెమీకాన్ భారత్ సదస్సును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. సెప్టెంబరు 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు 600కు పైగా సంస్థలు, 52 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు. ప్రపంచానికి నమ్మకమైన, ఆధునిక తయారీ కేంద్రంగా భారత్‌ను తీర్చిదిద్దేందుకు సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ప్రధాని ప్రపంచ సంస్థలకు పిలుపునిచ్చారు. భారత్‌లో సెమీకండక్టర్ రంగం వేగంగా విస్తరిస్తోందని, పెట్టుబడులు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

**ప్రపంచ చిప్ తయారీకి భారత్ కీలక గమ్యం**

'సిలికాన్ నుంచి వ్యవస్థల వరకు.. పర్యావరణ వ్యవస్థ నిర్మాణం' అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ సదస్సు కేవలం ప్రదర్శనకే పరిమితం కాకుండా సెమీకండక్టర్ రంగం మొత్తం విలువ గొలుసును ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. చిప్ రూపకల్పన నుంచి తయారీ, అధునాతన ప్యాకేజింగ్, పరికరాలు, పదార్థాలు, ఎలక్ట్రానిక్స్, తుది వ్యవస్థల వరకు వివిధ దశల్లో భారత్ అభివృద్ధి చేసుకుంటున్న సామర్థ్యాలను సదస్సులో ప్రదర్శిస్తున్నారు.

600కు పైగా ప్రదర్శకులు, 300 అంతర్జాతీయ సంస్థలు, 150 మందికి పైగా ప్రముఖ వక్తలు ఇందులో పాల్గొంటున్నారు. 15 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటైన ప్రదర్శనలో ఆరు దేశాల ప్రత్యేక ప్రదర్శనా విభాగాలు, 12 రాష్ట్రాల విభాగాలు, అంకుర సంస్థల ప్రదర్శన, విద్యార్థుల కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్రతి ఆధునిక రంగానికీ చిప్ అత్యవసరం

సెమీకండక్టర్లు ఆధునిక ఆర్థిక వ్యవస్థకు పునాదిగా మారాయి. మొబైల్ ఫోన్లు, కార్లు, వైద్య పరికరాలు, రక్షణ వ్యవస్థలు, కృత్రిమ మేధ, సమాచార సాంకేతికత, అంతరిక్ష రంగం, పారిశ్రామిక యంత్రాలు.. ఇలా దాదాపు ప్రతి ఆధునిక సాంకేతిక రంగంలో చిప్‌ల వినియోగం కీలకంగా ఉంది.

ప్రపంచవ్యాప్తంగా చిప్‌ల సరఫరాలో అంతరాయాలు ఏర్పడిన సందర్భాల్లో వాహనాలు, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలు తీవ్రంగా ప్రభావితమైన నేపథ్యంలో దేశాలు స్వదేశీ చిప్ తయారీ సామర్థ్యాన్ని వ్యూహాత్మక ప్రాధాన్యంగా పరిగణిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశ్వసనీయమైన సరఫరా గొలుసులో భారత్‌ను కీలక భాగస్వామిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్రం సెమీకండక్టర్ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

**సెమీకాన్ 2.0తో భారీ ప్రణాళిక**

సెమీకండక్టర్ రంగంలో తదుపరి దశ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సెమీకాన్ 2.0 కార్యక్రమాన్ని ఆమోదించింది. 2026 జూలైలో ఆమోదించిన ఈ కార్యక్రమానికి రూ.1.27 లక్షల కోట్ల కేటాయింపు ఉంది. పరిశోధన, చిప్ రూపకల్పన, యంత్రాలు-పదార్థాలు, కొత్త తయారీ కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి, అధునాతన ప్యాకేజింగ్ రంగాలను మరింత బలోపేతం చేయడం దీని లక్ష్యాల్లో ఉన్నాయి.

మొదటి దశలో ఏర్పాటైన పునాదులపై రెండో దశను నిర్మిస్తూ ముడి పదార్థాల నుంచి పూర్తిస్థాయి చిప్ తయారీ వరకు సమగ్ర పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఐదు సెమీకండక్టర్ యూనిట్లు వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించినట్లు కేంద్రం వెల్లడించింది.

**చిప్ రూపకల్పనలో భారత ప్రతిభ**

సెమీకండక్టర్ రంగంలో కేవలం తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయడమే కాకుండా చిప్ రూపకల్పన సామర్థ్యాన్ని పెంచడంపైనా కేంద్రం దృష్టి సారించింది. దేశవ్యాప్తంగా 500కు పైగా సంస్థలకు చెందిన లక్ష మందికి పైగా ఇంజినీర్లకు అధునాతన చిప్ రూపకల్పన సాధనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికారిక సమాచారం వెల్లడించింది.

400 విద్యాసంస్థలు, 100 అంకుర సంస్థలు ఇందులో భాగస్వామ్యమయ్యాయి. వీటి ద్వారా 300కు పైగా చిప్ రూపకల్పనలు అభివృద్ధి చేసినట్లు కేంద్రం తెలిపింది. దీనివల్ల ఖరీదైన రూపకల్పన సాధనాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు దేశీయ ప్రతిభకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొంది.

**ప్రపంచ సంస్థలకు పెట్టుబడుల ఆహ్వానం**

ప్రపంచం విశ్వసనీయమైన కొత్త తయారీ కేంద్రాల కోసం చూస్తోందని, ఆ అవసరాన్ని తీర్చేందుకు భారత్ సిద్ధమవుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశంలో పెట్టుబడులు, పరిశోధన, సాంకేతికత అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు.

దేశంలో పరిశోధనలు చేస్తున్న యువత ముందుకు రావాలని, విదేశాల్లో పరిశోధనలు చేస్తున్న భారతీయ యువ ప్రతిభ కూడా అధునాతన సాంకేతికతల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ప్రధాని పిలుపునిచ్చారు. పరిశ్రమలు దేశంలో పరిశోధన, అభివృద్ధికి నాయకత్వం వహించాలని కోరారు. పరిశ్రమల వృద్ధితో పాటు యువతకు అవకాశాలు పెరగడానికి ఇది దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

**సరఫరా గొలుసే కీలక బలం**

సెమీకండక్టర్ తయారీకి కేవలం కర్మాగారం ఏర్పాటు చేయడం సరిపోదు. నిరంతర విద్యుత్, స్వచ్ఛమైన నీరు, ప్రత్యేక రసాయనాలు, వాయువులు, అధునాతన యంత్రాలు, రవాణా వ్యవస్థలు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, సరకు రవాణా మార్గాలు వంటి అనేక మౌలిక సదుపాయాలు అవసరం.

అందుకే భారత్ సెమీకండక్టర్ రంగాన్ని ఒకే తయారీ కేంద్రానికి పరిమితం చేయకుండా పూర్తి సరఫరా గొలుసును దేశంలోనే అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపడుతోంది. యంత్రాలు, పదార్థాలు, రూపకల్పన, తయారీ, ప్యాకేజింగ్, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని రంగాలను అనుసంధానించడంపై దృష్టి పెడుతోంది.

**ప్రపంచ చిప్ సరఫరాలో భారత్ భాగస్వామ్యం**

సెమీకండక్టర్ రంగంలో భారత్ ఇప్పటికే అమెరికా, జపాన్, యూరోపియన్ యూనియన్, సింగపూర్, నెదర్లాండ్స్ వంటి భాగస్వాములతో సహకారాన్ని అభివృద్ధి చేసుకుంది. ప్రపంచ సెమీకండక్టర్ రూపకల్పన రంగంలోనూ భారత్‌కు గణనీయమైన మానవ వనరుల బలం ఉందని కేంద్రం పేర్కొంది. ప్రపంచంలోని సెమీకండక్టర్ రంగ సామర్థ్య కేంద్రాల్లో భారత వాటా సుమారు ఏడు శాతంగా ఉండగా, ప్రపంచ చిప్ రూపకల్పన మానవ వనరుల్లో భారతీయుల వాటా దాదాపు 20 శాతంగా ఉందని అధికారిక నేపథ్య సమాచారం వెల్లడించింది.ఈ మానవ వనరుల బలాన్ని దేశీయ తయారీ సామర్థ్యంతో అనుసంధానించడం ద్వారా భారత్ చిప్ రూపకల్పన కేంద్రంగా మాత్రమే కాకుండా తయారీ, ప్యాకేజింగ్, పరికరాలు, పదార్థాలు, పరిశోధన రంగాల్లోనూ తన స్థాయిని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**భారత్ చిప్ శక్తిగా ఎదిగే దిశగా**

సెమీకాన్ భారత్-2026 సదస్సు ద్వారా భారత సెమీకండక్టర్ ప్రయాణంలో కొత్త దశ ప్రారంభమైంది. ప్రపంచ సంస్థలకు పెట్టుబడుల అవకాశాలను చూపించడంతోపాటు దేశీయ పరిశ్రమలు, అంకుర సంస్థలు, విద్యాసంస్థలు, పరిశోధకులు, విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ సదస్సు ప్రత్యేకతగా నిలిచింది.స్వదేశీ చిప్ తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవడం, ప్రపంచ సరఫరా గొలుసులో విశ్వసనీయ భాగస్వామిగా ఎదగడం, అధునాతన సాంకేతికతలలో దేశీయ పరిశోధనను బలోపేతం చేయడం, లక్షలాది నైపుణ్య అవకాశాలను సృష్టించడం వంటి లక్ష్యాలతో భారత్ ముందుకు సాగుతోంది. సెమీకాన్ భారత్-2026లో ప్రధాని మోదీ చేసిన పెట్టుబడుల ఆహ్వానం ఈ వ్యూహానికి అంతర్జాతీయ పరిశ్రమల నుంచి మరింత భాగస్వామ్యాన్ని ఆకర్షించడమే లక్ష్యంగా కనిపిస్తోంది.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నగారా

- **ఓటర్ల నమోదు అంకం షురూ**
- **నవంబరు 6లోపు నమోదు చేసుకోవాలి**
- **పాత జాబితాలో పేరున్నవారూ మళ్లీ దరఖాస్తు చేయాల్సిందే.**



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో రాబోయే శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలకు ఎన్నికల సంఘం కీలక ప్రక్రియను ప్రారంభించింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాలకు కొత్తగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ రెండు నియోజకవర్గాలకు నవంబరు 1, 2026ను అర్హత తేదీగా నిర్ణయించారు. అర్హులైన పట్టభద్రులు సవరించిన నమూనా-18లో నవంబరు 6లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

పాత జాబితా ఉన్నా.. మళ్లీ దరఖాస్తే

ఈసారి ఓటర్ల జాబితాను పూర్తిగా కొత్తగా రూపొందిస్తున్నందున ఇప్పటికే పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితాలో పేరున్నవారు కూడా మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుధర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. పాత జాబితాలో పేరు ఉందన్న కారణంతోనే అర్హతను పరిగణనలోకి తీసుకోబోమని తెలిపారు. సవరించిన నమూనా-18తో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించిన తర్వాతే అర్హతను పరిశీలిస్తారు.

నవంబరు 1 కీలక అర్హత తేదీ

పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదు కావాలంటే ఎన్నికల సంఘం నిర్దేశించిన అర్హత నిబంధనలను పూర్తి చేయాలి. నవంబరు 1, 2026ను అర్హత తేదీగా నిర్ణయించారు. సంబంధిత విద్యార్హత, సాధారణ నివాసం తదితర వివరాలను అధికారులు పరిశీలించిన అనంతరం అర్హులైన వారి పేర్లను జాబితాలో చేర్చనున్నారు.

పట్టభద్రుల నియోజకవర్గాల ఓటర్ల నమోదు సాధారణ శాసనసభ నియోజకవర్గాల ఓటర్ల నమోదుతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించడం ఇందులో కీలకమైన అంశం. ఎన్నికల సంఘం నిర్దేశించిన నమూనా-18లోనే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

**నవంబరు 6 వరకు అవకాశం**

అర్హత ఉన్న పట్టభద్రులు సవరించిన నమూనా-18లో నవంబరు 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా సమర్పించే సదుపాయం ఉంది. అలాగే సంబంధిత ఎన్నికల నమోదు అధికారుల కార్యాలయాలు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, నియమిత అధికారులు, అదనపు నియమిత అధికారులకు నేరుగా దరఖాస్తులు అందజేయవచ్చు. తపాలా ద్వారా కూడా పంపే అవకాశం కల్పించారు. దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాల ధ్రువీకరించిన ప్రతులను జతచేయాలని ఎన్నికల అధికారులు సూచించారు. కేవలం పాత ఓటర్ల జాబితాలో పేరు ఉందని పేర్కొనడం ద్వారా అర్హత నిర్ధారణ కాదని స్పష్టం చేశారు.

**సెప్టెంబరు 28న ప్రక్రియకు శ్రీకారం**

ఓటర్ల నమోదుకు సంబంధించిన ప్రజా ప్రకటనను సెప్టెంబరు 28న జారీ చేయనున్నారు. అనంతరం అక్టోబరు 15, 25 తేదీల్లో పత్రికల్లో మరోసారి ప్రకటనలు ప్రచురించనున్నారు. అర్హులైన పట్టభద్రులు ఈ ప్రకటనలను గమనించి నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం అధికారులు వాటిని పరిశీలించి ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను చేపడతారు. నవంబరు 20 నాటికి ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ, ముద్రణ ప్రక్రియ పూర్తిచేసి నవంబరు 25న ముసాయిదా జాబితాను ప్రకటించనున్నారు.

ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, సవరణలు కోరేందుకు నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు అవకాశం ఉంటుంది. అందిన అభ్యంతరాలు, దావాలను పరిశీలించి డిసెంబరు 25లోగా పరిష్కరించనున్నారు. అనంతరం డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటించేలా ఎన్నికల సంఘం షెడ్యూల్ రూపొందించింది.

**రెండు నియోజకవర్గాలపై ప్రత్యేక ఆసక్తి**

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యమున్న నియోజకవర్గాలు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ప్రాంతాలతో పాటు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పరిధిలోని పట్టభద్రులు ఈ ప్రక్రియలో భాగస్వాములు కానున్నారు. ఈ రెండు నియోజకవర్గాలకు శాసనమండలి ఎన్నికలు 2027 మార్చిలో జరగాల్సి ఉన్న నేపథ్యంలో ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియకు ప్రాధాన్యం ఏర్పడింది.

**అర్హులైన పట్టభద్రులు అప్రమత్తం**

ఓటు హక్కు వినియోగించాలనుకునే అర్హులైన పట్టభద్రులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకుని దరఖాస్తు చేసుకోవడం కీలకం. ముఖ్యంగా పాత ఓటర్ల జాబితాలో పేరు ఉన్నవారు కూడా ఈసారి మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉండటంతో ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. ముసాయిదా జాబితా వెలువడిన తర్వాత తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవడంతో పాటు, పేరు లేకపోతే లేదా వివరాల్లో తప్పులు ఉంటే నిర్ణీత వ్యవధిలో దావా లేదా అభ్యంతరం దాఖలు చేసే అవకాశం ఉంటుంది. తుది జాబితా డిసెంబరు 30న వెలువడనున్న నేపథ్యంలో వచ్చే పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు ఎన్నికల ప్రక్రియకు ఇది కీలకమైన తొలి అడుగుగా మారింది.



## సమష్టి భాగస్వామ్యంతో స్వచ్ఛ వరంగల్ నిర్మిద్దాం

- జీడబ్ల్యూఎంసి కమిషనర్ టి వెంకన్న
- నేటి నుండి అక్టోబర్ 17 వరకు విస్తృత కార్యక్రమాలు

**వరంగల్, కార్పొరేషన్ మహా ;** స్వచ్ఛతే సేవ.. సమష్టి భాగస్వామ్యంతో స్వచ్ఛ వరంగల్ నిర్మిద్దామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవా-2026లో భాగంగా జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో గురువారం అలంకార్ జంక్షన్ వద్ద గల కాలువలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని కమిషనర్ టీ. వెంకన్న ప్రారంభించారు. సిబ్బందితో కలిసి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రమైన నగరం ప్రజల సమష్టి బాధ్యతతోనే సాధ్యమవుతుందని తెలిపారు. "స్వచ్ఛత మే సహభాగ్ - స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్" సందేశంతో ప్రజల్లో బాధ్యతను పెంపొందించడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. అలంకార్ జంక్షన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కాలువ వద్ద, రోడ్డు కిరువైపులా పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు. పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణపై స్థానికులకు అవగాహన కల్పించారు. మన నగరం - మన బాధ్యత, మన పరిసరాలు - మన బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రజలు స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వరంగల్ ను పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కమిషనర్ కోరారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెలరోజుల పాటు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందిస్తూ, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా సహకరించాలని కోరారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు "ఏక్ పెడ్ మా కే నామ్"లో భాగంగా మొక్కల పెంపకం చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, జవాన్లు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బల్దియాలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



**వరంగల్, కార్పొరేషన్ మహా ;** జాపాలన దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రజాపాలన లక్ష్యమని అన్నారు. ప్రజల సంక్షేమం, నగర అభివృద్ధి కోసం ప్రతి అధికారి, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువైన సేవలు అందించాలని సూచించారు. ప్రజల విశ్వాసమే పాలనకు బలం అని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రత్యేక అధికారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టీ. వెంకన్న, అదనపు కమిషనర్ ఇసంపల్లి జోనా, సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్ కుమార్, ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజారెడ్డి ముఖ్య ఉద్యానవన అధికారి లక్ష్మారెడ్డి ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ జనార్ధన్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, అకౌంట్స్ అధికారి శివ లింగం, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్ బాబు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే విమోచన దినోత్సవం

- అమరులను విస్మరించిన కాంగ్రెస్, బీఆర్ఎస్
- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వరంగల్, మహా ;** కొన్ని రాజకీయ పార్టీలు కేవలం కొన్ని వర్గాల ఓట్ల కోసమే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా చారిత్రక ద్రోహానికి ఒడిగడుతున్నాయని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ నాటి నిజాం సర్కార్ సాగించిన నిరంకుశ పాలన, ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్ల మూకలు సృష్టించిన అరాచకాలను గుర్తుచేశారు. పరకాల, బైరాన్‌పల్లి వంటి ప్రాంతాలలో జరిగిన నరమేధాన్ని వివరిస్తూ, నిర్మల్ లో వెయ్యి మందిని మర్రిచెట్టుకు ఉరితీసి బలిగొన్న ఉదంతాన్ని కళ్లకుడుగట్టేలా వివరించారు. ఆనాటి అమరుల త్యాగాల పునాదులపైనే నేడు తెలంగాణ స్వేచ్ఛా వాయువులు పీలుస్తోందని కొనియాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే విమోచన దినోత్సవ ప్రాముఖ్యతను తగ్గించి, ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శించారు.రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని, అధికారంలోకి రాగానే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా, అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. రజాకార్ల అరాచకాలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించిన బైరాన్‌పల్లి, పరకాల వీరుల పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ చాటాలని, రాబోయే తరాలకు ఈ చరిత్రను అందించడమే అమరులకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్,జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు కనుకుంట్ల రంజిత్ కుమార్, బైరి శ్యాంసుందర్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు బోడ విజయ్, కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతి కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మదాసు రాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దండు కిషన్, బిజెపి నాయకులు మెంతుల యాదగిరి, మహమ్మద్ రఫీ, బోడకుంట శివశంకర్, ముద్దసాని కృష్ణ, గోదాసి అశ్విన్ కుమార్ మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇది ప్రజా ప్రభుత్వం

- కొనసాగుతోంది ప్రజా పాలన
- ప్రభుత్వం లో ప్రజలే మూలం
- ప్రజాపాలన దినోత్సవ వేడుకలలో
- ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్




**ఆదిలాబాద్ మహా:** నిజాం పాలనకు ముగింపు పలికి, ప్రజాస్వామ్య పాలనకు స్వాగతం పలికిన అనంతరం ప్రత్యే క రాష్ట్రంలో నేడు ప్రజాపాలన కొనసాగుతోందని ఈ ప్రభుత్వంలో ప్రజలే ప్రభుత్వానికి మూలమని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన కోసం అనేక సంస్కరణలు ప్రారంభమయ్యాయన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా ప్రతినిధులు , కలెక్టర్ , ఎస్పీ లతో కలిసి జాజీతీయ జెండాను ఆవిష్కరించారు. అమర వీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు.ప్రజాపాలనలో గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలు, స్థానిక సంస్థల ద్వారా ప్రజల ప్రత్యక్ష పాలన. గ్రామ సభలు, వార్డు సభల ద్వారా ప్రజల అభిప్రాయాలకి తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు వంటి గ్యారంటీల ప్రజానుకూల పథకాలపై పారదర్శకత, సమగ్ర పాలనపై దృష్టి సారించి అభివృద్ధి దిశగా తెలంగాణ ముందుకు సాగుతుందన్నారు. కొత్త రేషన్ కార్డులు , డిజిటల్ కార్డులు సన్నబియ్యం పంపిణీతో ప్రజల మన్ననలు పొందిందన్నారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగతి గురించి వివరించారు. అనంతరం తెలంగాణ హాకీ అకాడమీకి ఎంపికైన 15 మంది జిల్లా క్రీడాకారులకు హాకీ స్టిక్ లను, 30 వేల నగదును ప్రభుత్వ సలహాదారుల చేతుల మీదుగా అందజేసి అభినందించారు. ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్. రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, అదనపు ఎస్పీ మౌనిక, ఏఎస్పీ రిత్విక్ సాయి కొట్టే, డిఎస్పీ జీవన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

- ప్రజా సంక్షేమం అభివృద్ధే లక్ష్యం
- ప్రభుత్వ విప్ వేముల వీరేశం సందేశం

**నిర్మల్ మహా:** ఎంతో మంది వీరుల త్యాగాల ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి లభించి తెలంగాణ రాష్ట్రంలో నేడు ప్రజాపాలన దినోత్సవాలు జరుపుకుంటున్నామని ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల తో కలిసి ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను విప్ వివరించారు. ప్రజలకిచ్చిన హామీలను సీయం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ,మహాలక్ష్మి పథకం, విద్యా వైద్యారోగ్యం,గృహజ్యోతి ,కొత్త రేషన్ కార్డులు, డిజిటల్ రేషన్ కార్డులు , సన్నబియ్యం, పంటలకు మద్దతు ధర, రైతు భరోసా,ఆయిల్ పామ్ సాగు కు సాయం,చేయూత ఫించన్లు,గ్రామపంచాయితీల కొత్త భవనాలు , బీసీ, ఎస్సీ ఎస్టీల సంక్షేమం కోసం నిధులుక్రీడలు మహిళా శిశు సంక్షేమంఇలా ఎన్నో రంగాలలో ప్రభుత్వం సాధించిన పురోగతిని వివరించారు. గోదావరి పుష్కరాలు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఇందుకు బాసరలో తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ఉద్యానవన పంటల అభివృద్ధికి కృషి చేసిన మండల వ్యవసాయ అధికారులను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారు పుట్ట సుమన్‌కు మంజూరైన ఎలక్ట్రిక్ ట్రాలీ ఆటోను ప్రభుత్వ విప్ వేముల వీరేశం, కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులు కలిసి అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్వో రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు షబ్బీర్ అలీ

**ఆదిలాబాద్ మహా:** అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని గాయత్రి గార్డెన్‌లో నిర్వహించిన రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా కళ్ల అద్దాల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా రెండో విడతలో భాగంగా 750 మంది లబ్ధిదారులకు రూ. 5 లక్షల చొప్పున ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 6 వేలకు పైగా ఇళ్లు మంజూరయ్యాయని, అర్హత ఉండి ఏ ఒక్కరికీ పథకం మిస్సయినా, తక్షణమే పరిశీలించి మంజూరు పత్రం అందజేస్తామని భరోసానిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి అనేక సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్నామని వెల్లడించారు. ప్రజాపాలన దినోత్సవ వేడుకలలో భాగంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు సైతం మంజుయ్యాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక పాలనకు నిదర్శనమన్నారు. ఆదిలాబాదు జిల్లా విమానాశ్రయం నిర్మాణంతో జిల్లా రూపురేఖలు మారనున్నాయని, జిల్లా మరింత ఆర్థిక అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ... జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి సంక్షేమ పథకాలు చేరేలా యంత్రాంగం పారదర్శకంగా పనిచేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో భాగంగా తొమ్మిది మండలాల పరిధిలో సుమారు 700 మందికి మంజూరు పత్రాలు అందజేస్తున్నామని, అలాగే స్లాబ్ రిప్లేస్‌మెంట్, మొదటి విడత పెండింగ్ బిల్లుల చెల్లింపులు సైతం ప్రక్రియల వారీగా పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో ఆరోగ్య పాఠశాలల ద్వారా విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు, సర్జరీలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు నిరంతరం శ్రమిస్తారని ఆయన భరోసానిచ్చారు.అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను, విద్యార్థులకు కళ్ళ అద్దాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్.రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, పిడి హౌసింగ్ శంకర్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, డిఈఓ మాధవి, ఆత్మ చైర్మన్ సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## నిమజ్జనానికి తగిన ఏర్పాట్లు చేయాలి

- చాందావాగు, పెన్ గంగా వద్ద పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్

**ఆదిలాబాద్ మహా:** వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా సతీష్ మున్సిపల్ అధికారులు సిబ్బందిని ఆదేశించారు. గురువారం మున్సిపల్ అధికారులు ,హిందూ ఉత్సవ సమితి సభ్యులతో కలిసి వినాయక నిమజ్జనం జరిగే చాందావాగు,పెన్ గంగా బ్రిడ్జి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లపై మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు.నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాలుగు భారీ క్రేన్లు, తగిన లైటింగ్ వ్యవస్థ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.గణేశ నవరాత్రుల నేపథ్యంలో మున్సిపాలిటీ తరఫున ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్టు తెలిపారు. నిమజ్జన మార్గాల్లో గుంతలు పూడ్చడం,పారిశుధ్యం , ఇతర అవసరమైన ఏర్పాట్లను రాబోయే నాలుగు , ఐదు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే నిమజ్జన ప్రాంతాల్లో అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి, లైటింగ్ ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేశ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా మున్సిపాలిటీ అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్ గౌడ్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ శంకర్, ఏఈలు నితిన్, కిరణ్, ఈఈ అరుణ్ కుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ,హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు బెండ లచ్చన్న , రాళ్లబండి మహేందర్ , సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనే తెలంగాణకు దిశానిర్దేశం

**మంచిర్యాల, మహా:** తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం ఉందని, నిరంకుశ నిజాం పాలన నుంచి విముక్తి పొంది ప్రజాస్వామ్య పాలనను సాధించుకున్న చారిత్రక దినమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాలరావు జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. తెలంగాణ విముక్తి కోసం పోరాడిన యోధులు, అమరులను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యంతో రూ.158 కోట్లకు పైగా లబ్ధి చేకూరిందని తెలిపారు. గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ ద్వారా వేలాది కుటుంబాలకు ప్రయోజనం కలిగిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేదల వైద్య చికిత్సలకు రూ.54.27 కోట్లు ఖర్చు చేశామని, మంచిర్యాలలో రూ.300 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, గుడిపేటలో వైద్య కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.జిల్లాలో 64,452 మంది రైతులకు రూ.540.66 కోట్ల పంట రుణాలు, 1.55 లక్షల మందికి రైతు భరోసా కింద రూ.199.77 కోట్లు అందించామని తెలిపారు.



## ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాక ఆవిష్కరణ..

**వలిగొండ సెప్టెంబర్ 17 మహా న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా వలిగొండ మండల కేంద్రం లో గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జలంధర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భారత జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గేయాన్ని ఆలపించారు.ఈ కార్యక్రమంలో వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి ఉపసర్పంచ్ మలుగ మాధవి, బిఆర్ఎస్ నాయకులు బలుగురి నరేష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బత్తిని నగేష్ తదితరులు పాల్గొన్నారు



## ఎస్పీ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

- జాతీయ జెండా ఆవిష్కరించిన ఎస్పీ
- ప్రజలకు తెలంగాణ ప్రజాపాలన శుభాకాంక్షలు

**ఆదిలాబాద్ మహా:** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని గురువారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం నందు ,జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రజలకు, సిబ్బందికి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని దానికి, ప్రతి ఒక్కరూ మరింత కృత నిశ్చయంతో విధులను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. దేశంలోని తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉండే విధంగా గెలిచేందుకు కృషి చేయాలని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం ఒకప్పటి హైదరాబాద్ రాష్ట్రం 1948 సెప్టెంబర్ 17 న భారత యూనియన్ నందు విలీనమైన సందర్భంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ సాధించడానికి కృషి చేసిన మహనీయులపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు పి మౌనిక ఐపీఎస్, బి సురేందర్ రావు, ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది డిపిఓ కార్యాలయం ఏవో శివ కుమార్, సూపర్డెంట్లు సులోచన, సంజీవ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**ఆదిలాబాద్ మహా:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా గురువారం కలెక్టరేట్ కార్యాలయ భవనంపై కలెక్టర్ రాజర్షి షా పోలీసు గౌరవ వందనం స్వీకరించి అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించారు. సిబ్బందికి జిల్లా ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఏవో వర్ణ, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ప్రధాని జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ

**జూలూరుపాడు, మహా :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 76వ జన్మదినం సందర్భంగా బిజెపి మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్ పార్టీ శ్రేణులతో కలసి గురువారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, దేశ ప్రధానమంత్రిగా 12 సంవత్సరాలు సుపరిపాలన చేస్తున్నారని పేర్కొన్నారు. భారత దేశ పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారని తెలిపారు. ఉచితంగా బియ్యం, ఎరువుల సబ్సిడీ, పీఎం కిసాన్, ఉజ్వల ఉచిత గ్యాస్, సిసి రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాల్స్, స్మశానవాటికలు, ప్రధాన మంత్రి సడక్ యోజన లింక్ రోడ్లు, ఉపాధి హామీ, స్వచ్ఛ భారత్, రైతు వేదిక భవనాలు, రెండు లక్షల బీమా, జన్ ధన్ యోజన, పక్కా గృహాలు, స్కూల్ బిల్డింగులు, అంగన్వాడీ భవనాలు, ముద్ర లోన్స్, నేషనల్ హైవేలు, రైల్వే లైన్లు, రైల్వే స్టేషన్ ల అభివృద్ధి లాంటి ఎన్నో పథకాలను బిజెపి ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. కేంద్రం ఎన్ని నిధులు ఇచ్చినా మన రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకోవట్లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని రమేష్ జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, మండల అధ్యక్షులు భూక్య రమేష్, సిరిపురపు ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, కార్యదర్శి ధారావత్ బాలకిషన్ కిసాన్ తోపాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.




# కల్పిత నాయకుడు పుస్తకాన్ని నిషేధించాలి

- **అంబేద్కర్‌ను కించపరిచేలా రచనలు చేశారని మాల మహానాడు నిరసన..**
- **రచయితపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓకు వినతి**

**మణుగూరు, మహా :** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచే విధంగా రచనలు చేశారని ఆరోపిస్తూ హమారా ప్రసాద్ రచించిన 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని తక్షణమే నిషేధించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. మాల మహానాడు మణుగూరు అధ్యక్షుడు వేర్పుల నరేష్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంటర్ వద్ద నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మణుగూరు ఎస్‌హెచ్‌ఓకు వినతిపత్రం అందజేసి రచయితపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కల్పిత నాయకుడు పుస్తకంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చరిత్రను వక్రీకరించడంతో పాటు ఆయనను అవమానించేలా అసత్య ఆరోపణలు చేశారని మాల మహానాడు నాయకులు ఆరోపించారు. ఇటువంటి రచనలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో అంబేద్కర్ అభిమానులు, దళితుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని పేర్కొన్నారు. వివాదాస్పద పుస్తకం విక్రయాలు, ప్రచారాన్ని నిలిపివేసి, ఆన్‌లైన్‌లో ఉన్న సంబంధిత ప్రచురణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. రచయితపై వర్తించే చట్ట నిబంధనల ప్రకారం, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలించాలని పోలీసులను కోరారు. ప్రభుత్వం, పోలీసులు స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బూర్గుల సతీష్, గౌరవ సలహాదారు దొడ్డి భద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పుల జాన్, ఉపాధ్యక్షుడు బూర్గుల సంజీవరావు, మాల జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు చిట్టి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి దాసరి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిగొండ రామకృష్ణ, డబ్ల్యూసీఎం కుమార్, వేర్పుల నర్సయ్య, మహిళా అధ్యక్షురాలు నీలం పార్వతి, మండల కార్యదర్శి కొప్పుల మౌనిక, వేమూరి కిరణ్, కట్టా నరసింహ, బూర్గుల కరుణాకర్, భీమ్ జై భీమ్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వీర తెలంగాణ సాయుధ పోరాటం మహోన్నతం..

- **కార్మిక, వర్గ పోరాటాలను బలోపేతం చేస్తాం..**
- **సీపీఎం సీనియర్ నేత నెల్లూరి నాగేశ్వరరావు**

**మణుగూరు, మహా :** భూమి, భుక్తి, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలోనే మహోన్నతమైనదని సీపీఎం సీనియర్ నాయకుడు నెల్లూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం మణుగూరులోని సీపీఎం కార్యాలయంలో వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. తొలుత అమరవీరుల స్తూపానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మడి నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో నెల్లూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం నాటి నిజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటాన్ని హిందూ-ముస్లిం పోరాటంగా బీజేపీ వక్రీకరిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రజలను సంఘటితం చేస్తూ కార్మిక, వర్గ పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి గోలెం సాయికృష్ణ మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక విధానాలు, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ దున్నేవాడికే భూమి అనే సాయుధ రైతాంగ పోరాట లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, కార్మికులను సంఘటితం చేస్తూ పార్టీని బలోపేతం చేసి వర్గ పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు కొడిశాల రాములు, మండల కార్యదర్శివర్గ సభ్యులు దామల్ల వెంకన్న, పిట్టల నాగమణి, బొల్లం రాజు, దొడ్డి నిర్మల, హమాలీ సంఘం నాయకుడు ఆర్ శ్రీను, రైతు సంఘం మండల అధ్యక్షుడు సంకనేని వెంకటరావు, పుప్పాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# అన్ని రంగాల్లో భద్రాద్రి అభివృద్ధికి కృషి

- **ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట**
- **విద్య వైద్యం మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత**
- **రహదారి రైల్వే విమాన రవాణా సౌకర్యాల విస్తరణకు చర్యలు**
- **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** అన్ని రంగాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కృషి చేయడంతో పాటుగా ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ విద్య వైద్యం మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని దీనికి తోడు రహదారి రైల్వే విమాన రవాణా సౌకర్యాల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నట్లుగా రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడిఓసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి తుమ్మల జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. సెప్టెంబర్ 17వ తేదీ తెలంగాణ చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రోజన్నారు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం విద్య వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. యువతకు నాణ్యమైన విద్య మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా విద్యా సంస్థలు మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సాగునీరు విద్యుత్ మార్కెటింగ్ రవాణా సౌకర్యాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విస్తృతమైన సహజ వనరులు అటవీ సంపద గిరిజన సంస్కృతి బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. సింగరేణి సంస్థ ద్వారా బొగ్గు ఉత్పత్తి పాల్వంచ థర్మల్ పవర్ స్టేషన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిలో జిల్లా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జిల్లాలో మెడికల్ కాలేజీ ఇంజనీరింగ్ కాలేజీతో పాటు ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా వైద్య రంగాల్లో మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి రహదారి రైల్వే కనెక్టివిటీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. పాండురంగాపురం నుంచి మాల్కంగిరి వైపు రైల్వే మార్గం అభివృద్ధి ద్వారా భద్రాచలానికి రైల్వే కనెక్టివిటీ కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అమరావతి-జగదల్‌పూర్ జాతీయ రహదారిని కొత్తగూడెం భద్రాచలం మీదుగా నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కొత్తగూడెం ఇల్లెందు హైదరాబాద్ మార్గాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు జిల్లాలోని ఇతర ప్రధాన రహదారులను అభివృద్ధి చేసేందుకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

**విమానాశ్రయానికి ప్రయత్నాలు..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. రహదారి రైల్వే రవాణాతో పాటు గోదావరి నదీ మార్గం ద్వారా రవాణా అవకాశాలను అభివృద్ధి చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పర్యాటకులు సులభంగా చేరుకునేలా రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా జిల్లాలో పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను విద్య వైద్యం వ్యవసాయం పరిశ్రమలు రవాణా పర్యాటకం మౌలిక వసతులు తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం.విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎస్పీ ఆఫీసులో "తెలంగాణ ప్రజా పాలన" వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలో కొనసాగిందని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో నిర్వహించిన ఆపరేషన్ పోలో చర్య వలన 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం చేయబడిందని పేర్కొన్నారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజాపాలనలో ప్రజల భాగస్వామ్యం పారదర్శకత జవాబుదారీతనం ఎంతో కీలకమని అన్నారు. ప్రజల భద్రత శాంతిభద్రతల పరిరక్షణ పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ ప్రతి పోలీసు అధికారి సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరం పరిష్కరించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు ప్రజా సంక్షేమం శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విశ్వకర్మల సంక్షేమానికి ప్రాధాన్యత

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** విశ్వకర్మల నైపుణ్యం, శ్రమ, సృజనాత్మకత సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య అన్నారు. విశ్వకర్మల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం యజ్ఞ మహోత్సవ్ విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు, యజ్ఞ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి విశ్వకర్మలు తమ నైపుణ్యం, కళా ప్రతిభతో సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సంప్రదాయ వృత్తి నైపుణ్యాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ విశ్వకర్మల సంప్రదాయ వృత్తులను ఆధునిక సాంకేతికతతో అనుసంధానించి యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, సంఘ నాయకులు, కళాకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కిష్టారం లో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



**సత్తుపల్లి, సెప్టెంబర్ 17: మహా :** ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా పాలన సాగిస్తూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయడమే ప్రజా పాలన దినోత్సవం స్ఫూర్తి అని కిష్టారం గ్రామపంచాయతీ సర్పంచ్ నరుకుళ్ల రాజేశ్వరి అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించడమే నిజమైన ప్రజా పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం-2026ను పురస్కరించుకొని కిష్టారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం జాతీయ పతాకాన్ని సర్పంచ్ నరుకుళ్ల రాజేశ్వరి, ఉపసర్పంచ్ శీలం నాగరాణితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే కేంద్రబిందువని, వారి అభిప్రాయాలు, సూచనలు, అవసరాలకు అనుగుణంగా పాలన సాగించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, విద్య, వైద్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజా పాలన అంటే ప్రజలకు దూరంగా ఉండే పాలన కాదని, ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే బాధ్యతాయుతమైన వ్యవస్థ అని వివరించారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దొడ్డ నాగేశ్వరరావు, వార్డు సభ్యురాలు ఓ. భవాని, ప్రజా వైద్యశాల వైద్యురాలు ప్రసన్న, ఏఎన్ఎం లు బేగం, సుమతి అంగన్వాడీ టీచర్లు మాధవవి, పద్మ ఐ.కె.పి పాలకుర్తి రాణి, కాంగ్రెస్ కార్యకర్తలు శీలం. వెంకటేశ్వర్లు, మారోజు. నాగేశ్వరరావు, బాణాల రవి, గ్రామపంచాయతీ సిబ్బంది శంకర్, రహీం, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన దినోత్సవం.. ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ



**సత్తుపల్లి, సెప్టెంబర్ 17: మహా :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బి.గంగారం సమీపంలోని 15వ ప్రత్యేక పోలీసు పటాల కార్యాలయంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాల కమాండెంట్ శ్రీ ఎన్. పెదబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కమాండెంట్ అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.

**హైదరాబాద్ సంస్థానం విలీనంలో కీలక పాత్ర..**

కార్యక్రమంలో కమాండెంట్ ఎన్. పెదబాబు మాట్లాడుతూ, 1948 సెప్టెంబర్ 17న నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేశారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడంలో అప్పటి కేంద్ర ప్రభుత్వ చర్యలతో పాటు సర్దార్ వల్లభాయ్ పటేల్ పోషించిన కీలక పాత్రను వివరించారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, జాతీయ సమైక్యత, ప్రజల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు దళాధిపతి శ్రీ ఏ. అంజయ్య, సహాయ దళాధిపతి శ్రీ బి. వేణుగోపాలరెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పటాలంలోని ఇతర అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# సేవా సమితి ఆధ్వర్యంలో.. వృత్తి శిక్షణ తరగతులు..

**మణుగూరు, మహా :** మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించడంతో పాటు తమ కుటుంబాలకు అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు దుర్గం సుమతి సూచించారు. మణుగూరు ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళల స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత వృత్తి శిక్షణ తరగతులను గురువారం పీవీ కాలనీలోని సింగరేణి సేవా భవన్‌లో ప్రారంభించారు. టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ తదితర విభాగాల్లో మహిళలకు శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సేవా సమితి అధ్యక్షురాలు సుమతితో పాటు ఏజీఎం (పర్సనల్) ఎన్ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడమే సేవా సమితి ప్రధాన లక్ష్యమన్నారు. ఇంటి వద్ద నుంచే నిర్వహించగల వృత్తుల్లో నైపుణ్యం సాధించడం ద్వారా మహిళలు ఖాళీ సమయాన్ని ఆదాయ మార్గంగా మార్చుకోవచ్చన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వారికి హైదరాబాద్ ఖాదీ గ్రామోద్యోగ్ మహావిద్యాలయం ద్వారా ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సర్టిఫికెట్లు భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీఎం (పర్సనల్) ఎన్ రమేష్, మైలవరం లేడీస్ క్లబ్ సభ్యులు, డీవైపీఎం బి శ్యామ్ ప్రసాద్, సేవా సెక్రటరీ శ్రీమతి షాహీనా, సేవా సమితి సభ్యులు, శిక్షణ పొందుతున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు నీటి గోస!



భద్రాద్రి కొత్తగూడెం, మహా: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు నీటి గోస పట్టిపీడిస్తుంది. గత ఐదు రోజులుగా వైద్యశాలకు నీటి సరఫరా లేక ఆరోగ్య సేవలపై ప్రభావం చూపడంతో పాటుగా తాగేందుకు నీరు లేక రోగులు సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. రక్త పరీక్షలు సజావుగా జరిగి అందుకు సంబంధించిన రిపోర్టులు సకాలంలో ఇవ్వాలంటే రక్త పరీక్షల ల్యాబ్‌కు నీటి వసతి ఎంతో ముఖ్యం. అలాంటిది గత ఐదు రోజుల నుండి ఆ ల్యాబ్ కు నీటి వసతి లేక రక్తపరీక్ష రిపోర్టులు ఆలస్యం కావడంవల్ల ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఎమర్జెన్సీ బ్లాక్ కు జనరల్ బ్లాకు నీటి సదుపాయం అత్యంత అవసరం. తాగేందుకు నీరు లేక కొంతమంది బయట నుంచి వాటర్ బాటిల్స్ ను కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీని వల్ల సందర్శకులపై రోగులపై ఆర్థిక భారం పడుతుంది. ప్రతిరోజు వందల సంఖ్యలో వైద్య సేవల నిమిత్తం ప్రజలు ఈ పెద్ద ఆసుపత్రికి వస్తుంటారు. నిరంతరం నీటి సదుపాయం ఉండాల్సి ఉండగా కొరత ఎందుకు ఏర్పడుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

***ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏవి...?***

భద్రాద్రి జిల్లా కేంద్ర ప్రధాన ప్రభుత్వాసుపత్రికి నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ సమస్య గత ఐదు రోజులుగా ఉన్నట్లుగా కొందరు ఆసుపత్రికి వచ్చే సందర్శకులు ఆరోపిస్తున్న పరిస్థితి ఉంది. భోజనం చేయాలన్న దాహం తీర్చుకోవాలన్న నీటి వసతి ఎంతో ప్రాధాన్యం. ఒకరోజు నీటి వసతి ఆగిపోయిన ఎంతో ఇబ్బంది కలుగుతుంది. అలాంటిది ఐదు రోజుల గడుస్తున్నా నీటి సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురాకపోవడంతో విమర్శలకు తావిస్తోంది. కనీసం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అయినా ఆసుపత్రికి నీటి సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది. కొందరి నిర్లక్ష్యం వల్లనే నీటి సమస్య ఏర్పడుతుందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వైద్యశాఖ అధికారుల స్పందించి తక్షణమే ధర్మాస్పత్రికి నీటి సదుపాయాన్ని కల్పించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

**పర్యవేక్షణ లేకనే సమస్యలు..**

భద్రాద్రి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి పై సంబంధిత అధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేని కారణంగానే సమస్యలు వస్తున్నాయని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు భూక్య రమేష్ ఆరోపించారు. ఐదు రోజులుగా ఆసుపత్రికి నీటి సమస్య ఉన్న తీర్చలేని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సరఫరాలో ఏమైనా లోపాలు ఏర్పడితే తక్షణమే ప్రత్యామ్నాయ మార్గం ద్వారా నీటి సదుపాయాలు కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం కావడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఆసుపత్రికి నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## తెలంగాణ అభివృద్ధిలో సింగరేణి పాత్ర కీలకం..

- ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.. జిఎం దుర్గం రామచందర్



**మణుగూరు, మహా :** తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, పోరాటాల స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సింగరేణి కాలరీస్ కంపెనీ మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మణుగూరు ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ తెలంగాణ సమాజం సాధించిన ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధిలో సింగరేణి సంస్థకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధితోపాటు ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. జాతీయ పతాకావిష్కరణ: ముందుగా జీఎం దుర్గం రామచందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. తెలంగాణ ప్రజల త్యాగాలు, పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సింగరేణి సేవలు మరింత విస్తృతం: బొగ్గు ఉత్పత్తితోపాటు సామాజిక బాధ్యత కార్యక్రమాల్లోనూ సింగరేణి ముందంజలో ఉందని రామచందర్ పేర్కొన్నారు. సంస్థ పరిసర ప్రాంతాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఉద్యోగులు సమష్టిగా కృషి చేసి సంస్థ లక్ష్యాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికారులు, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ తదితర కార్మిక సంఘాల ప్రతినిధులు, సీనియర్ పర్సనల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం..!

- జాతీయ జెండా ఎగురవేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్‌తో పాటు కలెక్టర్, అధికారులు హాజరు
- సాయుధ పోరాట యోధులకు ఘన నివాళులు.. అమరవీరుల కుటుంబాలకు సన్మానం



**రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 17 మహా:** సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో అధికారికంగా అంతర్భాగమైన చారిత్రక సందర్భాన్ని స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకలకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు, మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాకు వందనం చేశారు.

**పోరాట యోధులకు ఘన నివాళులు..**

తెలంగాణ చరిత్రలో కీలకమైన సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఉద్యమకారులు, యోధుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. వారి పోరాటం, త్యాగాల గురించి కార్యక్రమంలో ప్రస్తావించారు.

**మరవీరుల కుటుంబాలకు సన్మానం..**

వేడుకల్లో భాగంగా సాయుధ పోరాటం, ఉద్యమాలతో సంబంధం ఉన్న పలువురు అమరవీరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. వారికి జ్ఞాపికలు, శాలువాలతో గౌరవం తెలిపారు. చారిత్రక పోరాటాల్లో తమ కుటుంబ సభ్యులు చేసిన త్యాగాలను గుర్తుచేసుకుంటూ పలువురు కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు మాట్లాడుతూ... ప్రజాస్వామ్య విలువలు, ప్రజాపాలన ప్రాధాన్యతను గుర్తుచేశారు. చారిత్రక ఘట్టాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

సర్పంచ్ పగడాల

**దమ్మపేట, మహా :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన జెండావిష్కరణ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమ మే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యం గా పేర్కొన్నారు. తెలంగాణ సమాజం సాధించిన ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధిలో ప్రతిఒక్కరి బాధ్యత ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని పేర్కొన్నారు. పంచాయతీ అభివృద్ధితోపాటు పచ్చదనం ,పరిశుభ్రత అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించామని ఆమె తెలిపారు. ప్రజా ప్రభుత్వం కూడా పరిసర ప్రాంతాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కొల్లు దుర్గారావు ఆధ్వర్యంలో ముందుగా రాష్ట్ర గీతం ఆలపించారు. అనంతరం సర్పంచ్ చేతుల మీదుగా పతాకావిష్కరణ గావించారు. కార్యదర్శి మాట్లాడుతూ పంచాయతీ లోని ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యా ,వైద్యంతో పాటుగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను పేదలకు అందిస్తుందని పేర్కొన్నారు. మారుమూల పల్లెల్లో రహదారుల ఏర్పాటు , సాగునీటీ కోసం కాలువల ఏర్పాట్లు ప్రాజెక్టుల ద్వారా ప్రభుత్వం చేపడుతుందని ,ప్రజా సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అత్తులూరి వెంకట రామారావు ,పగడాల రాంబాబు , వార్డు సభ్యులు ,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాధికా చౌరస్తాలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

- సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి
- తెలంగాణ సప్త సంకల్పాలు' అమలు చేయాలని బీజేపీ డిమాండ్

**కుషాయిగూడ, మహా:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ డివిజన్ ఆధ్వర్యంలో రాధికా చౌరస్తా వద్ద జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్-మల్కాజిగిరి అర్బన్ జిల్లా కార్యదర్శి అంబటి వెంకటాచలం మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన రోజును తెలంగాణ విమోచన దినోత్సవంగా గుర్తించాలని అన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ నేతృత్వంలో జరిగిన 'ఆపరేషన్ పోలో' అనంతరం హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తున్న తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ విమోచన చరిత్ర, అమరవీరుల త్యాగాలను పరిరక్షించేందుకు బీజేపీ ప్రతిపాదించిన 'తెలంగాణ సప్త సంకల్పాల'ను నాయకులు వివరించారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ 17ను ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించడం, సర్దార్ వల్లభభాయ్ పటేల్ గౌరవార్థం 'స్టాట్యూ ఆఫ్ లిబరేషన్' నిర్మించడం, హైదరాబాద్-తెలంగాణ విమోచన మ్యూజియం ఏర్పాటు చేయడం వంటి ప్రతిపాదనలను వివరించారు. అలాగే ప్రతి జిల్లా కేంద్రంలో తెలంగాణ విమోచన స్మృతి కేంద్రాలు ఏర్పాటు చేయడం, విమోచన పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చడం, అజ్ఞాత అమరవీరుల అధికారిక జాబితా రూపొందించడం, చారిత్రక పోరాట ప్రాంతాల్లో స్మారక స్తూపాలు నిర్మించడం, పోరాట గ్రామాలు, కోటలు, అమరవీరుల క్షేత్రాలను కలుపుతూ ప్రత్యేక పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలని బీజేపీ ప్రతిపాదించింది. కార్యక్రమాన్ని నాగపురి నవీన్ సమన్వయం చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు రామ్మోహన్‌రావు, సిద్ధూరి సంపత్‌రావు, ఉమా శ్రీధర్, రజనీకాంత్ రెడ్డి, ప్రభుదాస్, సాయి ప్రసాద్, వంశీ, రత్నశ్రీ, భాగ్యలక్ష్మి, మంజుల, ఏనుగు సీతారామరెడ్డి, రణం సిద్దేశ్వర, గంగాధర్, గురునాథ్ రెడ్డి, సురేష్ ధర్మాకర్, జీఎస్పి రావు తదితరులు పాల్గొన్నారు.



## శక్తి సాయినగర్‌లో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంగిశెట్టి రవీంద్ర సాగర్

**కుషాయిగూడ,మహా :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శక్తి సాయినగర్ డివిజన్ బీజేపీ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంగిశెట్టి రవీంద్ర సాగర్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ విమోచన కోసం పోరాడిన యోధుల త్యాగాలను స్మరించుకున్నారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన సెప్టెంబర్ 17 ప్రాధాన్యతను నాయకులు వివరించారు. దేశ ఐక్యత, ప్రజాస్వామ్య విలువలు, జాతీయ సమైక్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. అనంతరం జాతీయ పతాకానికి వందనం చేసి దేశభక్తి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వీరన్న, నరేష్, లక్ష్మి, శ్రీనివాస్‌తో పాటు బీజేపీ మహిళా, యువ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**రాజేంద్రనగర్, మహా:** సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌గూడ పీవీఎన్‌ఆర్ పిల్లర్ నంబర్ 143 వద్ద గురువారం విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. నిజాం పాలన, రజాకార్ల అరాచకాలు, తెలంగాణ విమోచన ఉద్యమ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని బీజేపీ నాయకులు కోరారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పోషించిన పాత్రను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కీసరలో వినాయకుడి లడ్డూ చోరీ

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- లాకప్‌లో వ్యవహారంపై ఆరోపణలు

కుషాయిగూడ, మహా: కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని కీసర గ్రామంలో వినాయకుడి లడ్డూ చోరీ ఘటన కలకలం రేపింది. పోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లడ్డూ చోరీకి పాల్పడ్డారనే ఆరోపణలపై ఇద్దరిని కీసర పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే, చోరీ ఆరోపణలపై అదుపులోకి తీసుకున్న ఇద్దరితో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుల అదుపులో ఉన్న సమయంలో తమపై అనుచితంగా వ్యవహరించారని బాధితులు ఆరోపించినట్లు సమాచారం. చోరీ ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ఒక అంశం కాగా, అదుపులో ఉన్న వ్యక్తులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై వచ్చిన ఆరోపణలు మరో అంశంగా మారాయి. ఈ ఘటనలో వాస్తవంగా ఎంతమంది ఉన్నారు? ఇద్దరినే ఎందుకు అదుపులోకి తీసుకున్నారు? పోలీసుల వ్యవహారంపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం ఎంత? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ విషయాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. పోలీసుల అధికారిక వివరణ వెలువడిన తర్వాతే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## కీసరలో ఏసీబీ దాడుల కలకలం!

**సీఐ ఆంజనేయులు ఏసీబీకి పట్టుబడిన ఘటనతో హాట్‌టాపిక్**

**పోలీస్‌స్టేషన్ ఎదుట కొందరి సంబరాలు**



**కుషాయిగూడ, మహా:** కీసర పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు నిర్వహించిన ట్రాప్‌లో సీఐ ఆంజనేయులు పట్టుబడినట్లు వచ్చిన సమాచారంతో స్థానికంగా తీవ్ర చర్చ మొదలైంది. ఈ పరిణామంపై పోలీసుల వ్యవహారశైలిపై గతంలో అసంతృప్తి వ్యక్తం చేసిన కొందరు స్థానికులు, బాధితులు స్పందించినట్లు సమాచారం. ఏసీబీ చర్యల విషయం వెలుగులోకి వచ్చిన అనంతరం కీసర పోలీస్‌స్టేషన్ ఎదుట కొందరు పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్న ఘటన చర్చనీయాంశంగా మారింది. సీఐ ఏసీబీకి పట్టుబడటంపై వారు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "ఇక కీసరకు ధైర్యం వచ్చింది" అంటూ కొందరు స్థానికులు వ్యాఖ్యానించినట్లు సమాచారం. గతంలో పోలీసుల వ్యవహారశైలిపై ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆరోపించిన కొందరు కూడా తాజా పరిణామంపై స్పందించినట్లు తెలుస్తోంది. ఒకవైపు ఏసీబీ చర్యలు, మరోవైపు పోలీస్‌స్టేషన్ ఎదుటే కొందరి సంబరాలు కీసరలో హాట్‌టాపిక్‌గా మారాయి. అయితే ఏసీబీ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఆరోపణల స్వరూపం, ఈ వ్యవహారంలో మరెవరైనా పాత్ర ఉందా అనే అంశాలపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. పోలీస్‌స్టేషన్ ఎదుట పటాకులు కాల్చిన ఘటనపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపైనా స్పష్టత రావాల్సి ఉంది. ఏసీబీ చర్యల అనంతరం చోటుచేసుకున్న పరిణామాలపై ఉన్నతాధికారుల స్పందన కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు.



## పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన పలువురు..**

రాజేంద్రనగర్ మహా ; గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని రాళ్లగూడ దొడ్డి నుంచి కవ్వగూడా గ్రామం వరకు పిడబ్ల్యూ (అభివృద్ధి ) పనులను మండల అధికారులు, గ్రామ సర్పంచ్ కుక్కల ఇంద్రమ్మ ముదిరాజ్ తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్మాట్లాడుతూ. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే ఈ ప్రాంత ప్రజల రవాణా కష్టాలు తీరడమే కాకుండా, మెరుగైన కనెక్టివిటీ ఏర్పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల అధ్యక్షులు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ భగవానుడి ఆశీస్సులతో సమాజంలో శాంతి నెలకొన్నాలి

- బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శాంతినగర్ విశ్వకర్మ దేవాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బిజెపి నాయకులు విశ్వకర్మ సభ్యుల తో కలిసి విశ్వకర్మ జయంతి సందర్భంగా గురువారం విశ్వకర్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ యజ్ఞంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ విశ్వకర్మ భగవానుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వకర్మ సమాజంలోని ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మాధవ చారి, చారి, రాంపల్లి రవీందర్ చారి, గ్యానేశ్వర్ చారి, నరేధర్ చారి, వెంకట చారి, మహేష్ చారి, శివ చారి, రమేష్ చారి, చందీశ్వర్ చారి, సంతోష్ చారి, ఆంజనేయులు చారి, అభిలాష్ చారి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## అనాథ అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

**దమ్మపేట ,మహా :** మానవత్వాన్ని చాటుకోవాడానికి ఎన్నో మార్గాలున్నప్పటికి అంత్యక్రియల సమయంలో ఏ ఒక్కరూ ఆర్థిక సహాయం చేసేందుకు సహజంగా చొరవతీసుకోరు. అందుకు భిన్నంగా దమ్మపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ పగడాల రమాదేవి మరో అడుగు ముందుకేసి అనాద కు ఆర్థికంగా బాసటగా నిలిచింది. వివరాలు పరిశీలిస్తే కొత్తపేట కాలనీలో గురువారం మృతి చెందిన ఓ అనాదకు అంత్యక్రియలు చేసేందుకు ముందుకు వచ్చిన సేవకులకు తాత్కాలిక ఖర్చుల కోసం 5వేల రూపాయలు స్పాట్ లో అందజేసి మానవత్వం నిరూపించుకున్నారు. ఈ అంశంపై పలువురు స్థానికులు పార్టీలకు అతీతంగా ఆమెను అభినందించారు. కార్యక్రమంలో ఆమె వెంట ఉపసర్పంచ్ ఆంగోత్ శ్రీనివాస్ , గ్రామ పెద్దలు పగడాల రాంబాబు , వార్డు సభ్యులు గోళ్ళ భవానీ కృష్ణ యాదవ్ తదితరులు ఉన్నారు.

**గౌతమ్ బుద్ధ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం.**

అనాధకు అంత్యక్రియలు జరిపేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అంతిమ యాత్ర వాహనం పై తీసుకువెళ్ళి , అంత్యక్రియలు జరిపారు. ఇటువంటి ఎన్నో సేవలు నిరంతరంగా అందిస్తున్న సేవా బృందాన్ని పలువురు స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో అజీమ్ ,పాలడుగు ల అబ్బులు ,రొయ్యల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ లో అతిథి ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**మొయినాబాద్ మహా:** విద్యార్థులకు విద్యాబోధన చేయడానికి అతిథి అధ్యాపకులు, ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి హరిష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఖాసింబౌలి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన నజీబ్ నగర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు సాంఘిక శాస్త్రంలో విద్యాబోధన చేయడానికి కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ ( అతిథి ఉపాధ్యాయులుగా) గా పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు డిగ్రీతో పాటు బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఎంపికైన అభ్యర్థులకు నెలసరి వేతనం రు. 18 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అదే విదంగా ఇంటర్ విద్యార్థులకు( ఒకేషనల్ కోర్స్ ) విద్యాబోధన చేయడానికి బీఎస్సీ నర్సింగ్ చదివిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. వారికి నెలసరి వేతనంరూ.23 వేలు చెల్లించడం జరుగుతుందని అన్నారు. విద్యా బోధనతో పాటు రాత్రి సమయంలో స్టడీ అవర్స్ లో కూడా విధులు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 21వ తేదీ లోపు విద్యాలయానికి తమ విద్యార్హతల సర్టిఫికెట్లతోపాటు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## పెండ్లి సామాన్లు తీసుకొస్తూ రోడ్డు ప్రమాదంలో తండ్రి కూతురు మృతి..

- టిప్పర్ లారీ బీభత్సంతో...
- పెళ్లి బాజాలు మోగవలసిన ఇంట్లో.... చావు డప్పులు...



**రాజేంద్రనగర్ మహా ;** బిడ్డకు పెండ్లి కుదురడంతో ఘనంగా వివాహం చేసి అత్తారింటికి పంపాలనుకున్నారు.కాని మనం ఒకటి తలుస్తే విధి మరొకటి తలచినట్టుగా తండ్రీ, కూతురులు రోడ్డు ప్రమాదంలో అనంత లోకాలకు వెళ్లారు.మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో టిప్పర్ లారీ బీభత్సం సృష్టించింది. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతుర్లు దుర్మరణం పాలయ్యారు. అల్తాపూర్‌కు చెందిన ఇస్మాయిల్ ఖాన్ (45), అతని కుమార్తె బుష్రా బేగం (24) వివాహం నిశ్చయమైంది. పెండ్లికి సంబంధించిన సామాన్లు కొనుగోలు చేయడానికి తండ్రీకూతుర్లు ఇద్దరూ బుధవారం రాత్రి ద్విచక్రవాహనం (మోపెడ్) పై వెళ్లారు. ఈ క్రమంలో, వెనుక నుండి అతివేగంగా దూసుకొచ్చిన టిప్పర్ లారీ వీరి వాహనాన్ని దుర్గా నగర్ చౌరస్తాలో బలంగా ఢీకొట్టి వారిపై నుండి దూసుకెళ్లింది. దీంతో అక్కడికక్కడే ఇస్మాయిల్ ఖాన్ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన బుష్రా బేగంను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె కూడా మృతి చెందింది.టిప్పర్ లారీ డ్రైవర్ మద్యం మత్తులో (మద్యం సేవించి), మితిమీరిన వేగంతో పాటు నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు టిప్పర్ లారీని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మార్వో, ఎంపీడీవోలు

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ ప్రజా పాలన సందర్భంగా శంషాబాద్ మండలం ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి జి మున్ని మండల తాసిల్దార్ కార్యాలయా ఆవరణలో ఎమ్మార్వో అమరలింగం గౌడ్,జాతీయ జెండాను ఆవిష్కరించారు.కార్యక్రమంలో మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నరేంద్ర మోడీ బర్త్ డే వేడుకలు



**వలిగొండ సెప్టెంబర్ 17 మహా న్యూస్ :** బిజెపి మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో ఘనంగా విమోచన మరియు ప్రధానమంత్రి పుట్టిన రోజు వేడుకలు జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏలే చంద్రశేఖర్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా గురువారం వలిగొండ మండల కేంద్రంలో భారత త్రివర్ణ పతాకాన్ని ఎగిరేయడం జరిగింది అలాగే భారతదేశ చరిత్రను నలుమూలల వ్యాపింపజేస్తూ భారత దేశాన్ని విశ్వ గురువుగా చేయడం లక్ష్యంగా పెట్టుకొని భారతదేశాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తూ అవినీతి రహిత పాలనని అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ప్రధాని నరేంద్ర మోడీహాయంలో అనేక సంక్షేమ పథకాలు అమలు జరిగాయని వాటిని ప్రజల్లో విస్తృతంగా తీసుకువెళ్లాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో బందారపు లింగస్వామి మైసొల్ల రామ నర్సు బచ్చ శ్రీనివాస్ మందుల లక్ష్మి రాచకొండ కృష్ణ గంగ దారి దయాకర్ మందుల నాగరాజు ఎర్రబోలు జంగయ్య దంతూరి అరుణ్ కుమార్ ఆవనగంటి శివ తదితరులు పాల్గొన్నారు



# విరాట్ విశ్వకర్మ ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ విజయ రమణారావు

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన యజ్ఞ మహోత్సవ్-విరాట్ విశ్వకర్మ ఉత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి విశ్వకర్మ భగవానుడి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.విశ్వకర్మ భగవానుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విశ్వకర్మ సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ఘనంగా నిర్వహణ

**పెద్దపల్లి మహా :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీబొద్దుల గంగయ్య, రెవెన్యూ డివిజనల్ అధికారి, పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని గౌరవప్రదంగా ఆవిష్కరించడం జరిగింది.ప్రజా పాలన కార్యక్రమంలో ఇది వరకు చాలా అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆర్డీఓ గారు తెలిపారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధి మరియు ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు, సిబ్బంది తమ వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి బొద్దుల గంగయ్య, డి ఏ ఓ. టి రవీందర్ మరియు డివిజనల్ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

**ప్రభుత్వ విప్ విజయరమణారావు ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం.**

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయరమణారావు కలెక్టర్ కార్యాలయం నందు జెండా ఆవిష్కరించారు. సెప్టెంబర్ 17న నిర్వహించిన కార్యక్రమంలో ఆయన జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో చారిత్రాత్మకమైన రోజని విజయరమణారావు పేర్కొన్నారు. రాచరిక పాలనకు ముగింపు పలికి ప్రజాస్వామ్య ప్రస్థానం ప్రారంభమైన ఈ రోజును ప్రతి సంవత్సరం ప్రజాపాలన దినోత్సవంగా స్మరించుకోవడం ముఖ్యమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటాలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ రాష్ట్ర ప్రగతికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , అదనపు కలెక్టర్ బి శ్రీరాములు డిసిపి రామ్ రెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, వివిధ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు విజయ రమణారావు శుభాకాంక్షలు తెలిపారు.

# గణేష్ మండపాల వద్ద పటిష్ట భద్రత

**చొప్పదండి, మహా:** వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం చొప్పదండి, రామడుగు ప్రాంతాల్లోని గణేష్ మండపాలు, నిమజ్జన ప్రదేశాలను మున్సిపల్, అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లకు అవకాశం లేకుండా నాణ్యమైన వైరింగ్ వినియోగించాలని సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు ఇసుక, నీటి బకెట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాల నేపథ్యంలో మండపాల్లోకి నీరు చేరకుండా వాటర్‌ప్రూఫ్ షెడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో బారికేడ్లు, తగినంత లైటింగ్ ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పోలీస్, మున్సిపల్, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తనిఖీల్లో కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, చొప్పదండి సీఐ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం కమిషనరేట్‌లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



**పెద్దపల్లి మహా :** రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ మొక్కను అందజేసి పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝాకు స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, కమిషనరేట్ కార్యాలయ భవనం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ గీతంతో పాటు రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ'ను ఆలపించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందికి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలందరికీ ఎంతో ప్రాముఖ్యత కలిగిన చారిత్రక దినమని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం తెలంగాణ ప్రాంతం ప్రజాపాలనలోకి వచ్చిన సెప్టెంబర్ 17కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. అప్పటి నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రాంతం భారత యూనియన్‌లో విలీనమై సమగ్ర భారతదేశంలో అంతర్భాగంగా మారిన ఈ చారిత్రక పరిణామం కోసం ఎన్నో త్యాగాలు, బలిదానాలు చేసిన వారిని గౌరవంగా స్మరించుకోవాలని తెలిపారు. వారి త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటూ దేశ సమగ్రత, ఐక్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ శాంతి, సౌభ్రాతృత్వం, అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడం, భద్రత, సౌకర్యాలు కల్పించడం, శాంతిభద్రతలను మరింత పటిష్టంగా పరిరక్షించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి భద్రత, సంక్షేమం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఉత్తమమైన పోలీస్ సేవలు అందిస్తూ శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, ఏవో శ్రీనివాస్, ఆర్‌ఐలు మల్లేశం, దామోదర్, రమేష్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్ రావు, రామగుండం సీఐ కృష్ణ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావుతో పాటు వివిధ విభాగాల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, సీపీఓ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, ప్రత్యేక బృందాల సిబ్బంది పాల్గొన్నారు.

# అస్తిత్వ పోరాట ప్రతీక తెలంగాణ

- **సాయుధ పోరాటం నుంచి రాష్ట్ర సాధన వరకు మరువలేని చరిత్ర**
- **ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**కరీంనగర్ మహా:** తెలంగాణ రాష్ట్రం కేవలం భౌగోళిక ప్రాంతం కాదని.. అస్తిత్వం కోసం సాగిన అనేక పోరాటాలకు ప్రతీక అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. అంతకుముందు అమరవీరుల స్థూపం వద్ద మంత్రి నివాళులర్పించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ నిజాం పాలన నుంచి విముక్తి పొంది భారత దేశంలో విలీనమైన రోజును ప్రజా పాలన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి ప్రత్యేక రాష్ట్ర సాధన వరకు సాగిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, జిల్లాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. జిల్లాలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్లు, గృహజ్యోతి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళా సంఘాలకు భవనాలు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు. భూభారతి చట్టం అమలులో భాగంగా భూసర్వే, రీసర్వేకు చర్యలు చేపట్టామని, వ్యవసాయం, వైద్యం, విద్య, అంగన్వాడీలు, సంక్షేమ రంగాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జిల్లా అభివృద్ధికి నిర్మాణాత్మక సహకారం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థలు, జిల్లా ప్రజలకు మంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అడిషనల్ డీసీపీ వెంకటరమణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి, ఆర్డీవో షర్మిలతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

**మత సామరస్యం, సోదరభావంతో ముందుకు సాగాలి: సీపీ అంబర్ కిశోర్ ఝా**



పెద్దపల్లి మహా : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని అన్ని వర్గాల మతపెద్దలు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, ఐపీఎస్ ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని వర్గాల మతపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో శాంతి, సోదరభావం, పరస్పర గౌరవం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మతపెద్దలు, సమాజ పెద్దలు తమ పరిధిలోని ప్రజలకు, ముఖ్యంగా యువతకు శాంతి, సంయమనం, పరస్పర గౌరవంపై అవగాహన కల్పించాలని కోరారు. చిన్నపాటి సంఘటనలు లేదా వివాదాలు చోటుచేసుకున్నప్పుడు ఆవేశానికి లోనై ఎక్కువ మందిని సమీకరించకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమస్యలను ఎవరూ స్వయంగా పరిష్కరించేందుకు ప్రయత్నించవద్దని స్పష్టం చేశారు. వినాయక విగ్రహాల ఏర్పాటు ప్రాంతాల్లో సమస్యలు తలెత్తినా, నిమజ్జన శోభాయాత్రకు సంబంధించి ట్రాఫిక్, రహదారులు, నిమజ్జన సమయం, విగ్రహాల సంఖ్య తదితర అంశాల్లో ఇబ్బందులు ఉన్నా ముందుగానే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పరిస్థితులను పరిశీలించి అవసరమైన భద్రత, సమన్వయ ఏర్పాట్లు చేపడతామని పేర్కొన్నారు.నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా అన్ని మతాల విశ్వాసాలు, ప్రార్థనా స్థలాలు, ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సంయమనంతో వ్యవహరించాలని సీపీ సూచించారు. శోభాయాత్ర మసీదులు, ఇతర ప్రార్థనా స్థలాలు లేదా ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల మీదుగా వెళ్లే సమయంలో స్థానిక మతపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు ముందస్తుగా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. నమాజ్ సమయాలు, శోభాయాత్ర మార్గాలకు సంబంధించిన ప్రత్యేక అంశాలను ముందుగానే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, నినాదాలు చేసినా, సోషల్ మీడియాలో వివాదాస్పద లేదా అసత్య సమాచారాన్ని ప్రచారం చేసినా వెంటనే స్పందించకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆవేశపూరిత ప్రతిస్పందనలతో చిన్న సమస్యలు పెద్ద వివాదాలుగా మారే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలని సూచించారు.

**డీజేలకు అనుమతులు లేవు!**

గణపతి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా డీజేలకు అనుమతులు లేవని, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సీపీ స్పష్టం చేశారు. ఉత్సవాలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు పోలీస్ శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.

ఈ సమావేశంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు భీమేష్, శ్రీనివాస్, బెల్లంపల్లి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు, ఎస్‌ఐలు మనోహర్, రాజేందర్, చంద్రశేఖర్, సంధ్యారాణి, శ్రీలత, మత పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం



**కరీంనగర్ మహా :** విశ్వకర్మ భగవానుడి ఆరాధనతో కరీంనగర్‌లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కులబంధువులు, నాయకులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ పురోహితులు శ్రీ కొత్తపెల్లి బ్రహ్మచారి ఆధ్వర్యంలో యజ్ఞం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు చేసి, యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విశ్వకర్మ భగవానుడు సృష్టికర్తగా పూజలందుకుంటున్నారని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర విశిష్టమైనదని అన్నారు. వడ్రంగం, కమ్మరం, కంచరం, శిల్పం, స్వర్ణకార వృత్తుల ద్వారా తరతరాలుగా సమాజానికి సేవలందిస్తున్న విశ్వబ్రాహ్మణుల వృత్తి నైపుణ్యాలను కొనియాడారు. ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.కార్యక్రమంలో డీఆర్వో స్వామి, డీడీ బీసీడబ్ల్యూ అనిల్ ప్రకాష్ డీడబ్ల్యూఓ సరస్వతి, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, విశ్వబ్రాహ్మణ నాయకులు శ్రీరామోజు రవీంద్ర చారి, చెల్లోజు రాజు, శ్రీమంతుల సదాశివం, తిప్పారపు శ్రీనివాస్, గాలిపెల్లి శంకరయ్య, నాంపల్లి శ్రీనివాస్, మియాపురం రవీంద్ర చారి, కాయితోజు బ్రహ్మచారి, కట్ట జగన్, శ్రీధర్ రాజు, శ్రీరామోజు భగవాన్, గోగులకొండ శ్రీనివాస్, తోమిటి సదానందం, కడార్ల శివప్రసాద్, కట్ట జగన్, కనపర్తి దివాకర్, కడార్ల చంద్రశేఖర్, సామనపల్లి లక్ష్మీ శంకరాచారి, గోగులకొండ రాజు పాల్గొన్నారు.

# ఉద్యోగం పేరిట లక్ష మోసం

**పర్వతగిరి, మహా:** పీఎం కిసాన్ యోజనలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్ష మోసానికి పాల్పడిన ఏపీకి చెందిన వ్యక్తిని పర్వతగిరి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పర్వతగిరి సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన మాచర్ల ఆనంద్ సాగర్.. పర్వతగిరి మండలం మొండ్రాయి గ్రామానికి చెందిన కన్నెబోయిన రాజుకు పీఎం కిసాన్ యోజనలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి 2025 నవంబర్‌లో రూ.లక్ష తీసుకున్నాడు. అనంతరం ఉద్యోగం ఇప్పించకపోవడంతో పాటు డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకున్నాడు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన రాజు 2026 ఫిబ్రవరిలో పర్వతగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడి ఆచూకీ గుర్తించిన పోలీసులు విజయవాడలో అతను పనిచేస్తున్న కార్యాలయం వద్ద అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



# ఆర్థిక సహాయం అందజేసిన ఏలే చంద్రశేఖర్

**వలిగొండ సెప్టెంబర్ 17 మహా న్యూస్ :** వలిగొండ మండలంలోని టేకుల సోమవారం గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త కీర్తి వెంకటేశం ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ గురువారం మృతిని కుటుంబాన్ని పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు బంధారపు లింగస్వామి మండల అధ్యక్షులు బోళ్ల ుదర్శన్ రాచకొండ కృష్ణ బచ్చ శ్రీనివాస్ మైసొల్ల రామ నర్సు గజ్జల అమరేందర్ తదితరులు ఉన్నారు



# అంబేద్కర్ విజ్ఞాన్ భవన్ నిర్మాణానికి స్థల పరిశీలన

- **పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

కరీంనగర్ మహా: కరీంనగర్‌లో అంబేద్కర్ విజ్ఞాన్ భవన్‌ను అన్ని వసతులతో నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి భగత్‌నగర్‌లోని సర్వే నంబర్ 1104/22లో అంబేద్కర్ భవన్‌కు కేటాయించిన స్థలాన్ని మంత్రి పరిశీలించారు. హైదరాబాద్ స్థాయిలో ఆధునిక సదుపాయాలతో భవనాన్ని నిర్మించి విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ప్లాస్టిక్ నిర్మూలన, చెత్త తొలగింపు, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకర సమాజంతో పాటు దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నగరపాలక కమిషనర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీవో షర్మిల, డీఆర్డీఓ గీత తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి అడ్లూరి

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం మేడారం గ్రామంలో పలువురు బాధిత కుటుంబాలను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబాల పరిస్థితులను అడిగి తెలుసుకుని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి భరోసా కల్పించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.









# 'వారణాసి'తో మహేష్‌కు కొత్త మార్కెట్

**హైదరాబాద్, మహా:** సూపర్‌స్టార్ మహేష్‌బాబు, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ అడ్వెంచర్ చిత్రం 'వారణాసి'పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చిన తర్వాత మహేష్‌బాబు మార్కెట్ దక్షిణాదిని దాటి ఉత్తర భారతంలో మరింత విస్తరించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ మహేష్ కెరీర్‌లో ప్రత్యేకమైన చిత్రంగా నిలవనుందని అభిమానులు భావిస్తున్నారు. రాజమౌళి గతంలో తెరకెక్కించిన 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' చిత్రాలు దేశవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందాయి. ఆ సినిమాల ద్వారా ప్రభాస్, రామ్‌చరణ్, ఎన్టీఆర్‌లకు హిందీ మార్కెట్‌లో కూడా విస్తృత గుర్తింపు లభించింది. ఇదే నేపథ్యంలో 'వారణాసి' ద్వారా మహేష్‌బాబు కూడా ఉత్తరాది ప్రేక్షకులకు మరింత చేరువయ్యే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాల్లో చర్చ సాగుతోంది. మహేష్‌కు హిందీ ప్రేక్షకుల్లో ఇప్పటికే కొంత పరిచయం ఉంది. ఆయన నటించిన పలు తెలుగు చిత్రాల డబ్బింగ్ వెర్షన్లు టెలివిజన్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులోకి రావడంతో ఉత్తరాది ప్రేక్షకులు ఆయన సినిమాలను వీక్షించారు. అయితే 'వారణాసి' వంటి భారీ చిత్రంతో నేరుగా థియేటర్లలో ప్రేక్షకులను పలకరించడం ఆయనకు కొత్త మార్కెట్‌ను అందించే అవకాశం ఉంది. సినిమా విజయం సాధిస్తే మహేష్ తదుపరి చిత్రాలపై హిందీ పంపిణీదారులు, నిర్మాతల ఆసక్తి పెరిగే అవకాశముంది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్, ఇతర వాణిజ్య అవకాశాలు కూడా విస్తరించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'వారణాసి' విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# దక్షిణాది సినిమాల్లో అనైరా గుప్తా

హైదరాబాద్, మహా: తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో కొత్త తరం నటిగా, మోడల్‌గా అనైరా గుప్తా తన కెరీర్‌ను క్రమంగా విస్తరిస్తోంది. అందం, అభినయంతో పాటు డ్యాన్స్ నైపుణ్యంతోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. తెరపై ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్, స్టైలిష్ లుక్స్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్న ఈ భామకు దక్షిణాది చిత్రాల్లో వరుసగా అవకాశాలు లభిస్తున్నాయి. ప్రత్యేక పాటలు, విభిన్న పాత్రల ద్వారా తనలోని ప్రతిభను ప్రదర్శిస్తూ సినీ ప్రయాణంలో ముందుకు సాగుతోంది.

దీపక్ సరోజ్‌కు జోడీగా నటించిన రొమాంటిక్ చిత్రం ద్వారా అనైరా తెలుగు సినిమాకు పరిచయమైంది. హరీశ్ గడగాని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ నరసింహ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఈ సినిమా అనైరాకు తెలుగు ప్రేక్షకుల ముందుకు కొత్త నటిగా వచ్చే అవకాశాన్ని కల్పించింది. సహజమైన నటన, చురుకైన హావభావాలతో తన పాత్రకు న్యాయం చేసేందుకు ఆమె ప్రయత్నించింది. తొలి చిత్రంతోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని అనైరా దృష్టి సారించింది.తమిళ చిత్ర పరిశ్రమలోనూ అనైరా తన ఉనికిని చాటుకుంది. 2025లో వచ్చిన 'కొంబుసీవి' చిత్రంలో ప్రత్యేక గీతంలో కనిపించింది. దర్శకుడు పొన్రామ్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఆమె చేసిన ప్రత్యేక నృత్య ప్రదర్శన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. హై ఎనర్జీ డ్యాన్స్ నంబర్లు, ప్రత్యేక పాత్రలతో తనలోని మరో కోణాన్ని చూపించే ప్రయత్నం చేస్తోంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా విభిన్నమైన అవకాశాల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది.

2026లో అనైరా చేతిలో పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. వీరూరి వులవల దర్శకత్వం వహిస్తున్న 'పురుషహ' చిత్రంతో పాటు 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'లోనూ ఆమె భాగమవుతోంది. వీటితో పాటు మరికొన్ని ప్రత్యేక ప్రదర్శనలకు సంబంధించిన అవకాశాలు కూడా ఉన్నాయి. కొత్త సినిమాల ద్వారా తన నటనా పరిధిని విస్తరించేందుకు ఆమె ప్రయత్నిస్తోంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ అనైరా గుప్తా చురుకుగా ఉంటుంది. ఫొటోషూట్లు, ఫ్యాషన్ లుక్స్, డ్యాన్స్ వీడియోలు, తన సినీ ప్రాజెక్టులకు సంబంధించిన అప్‌డేట్లను అభిమానులతో పంచుకుంటూ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోనూ తన ఫాలోయింగ్‌ను పెంచుకుంటోంది. తెలుగు, తమిళ భాషల్లో మరిన్ని మంచి అవకాశాలను అందిపుచ్చుకుని దక్షిణాది చిత్ర పరిశ్రమలో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకోవడమే లక్ష్యంగా ఆమె ముందుకు సాగుతోంది. రాబోయే సినిమాలు అనైరా కెరీర్‌కు ఎలాంటి గుర్తింపును తీసుకొస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.



# చీరకట్టులో అనసూయ స్టైలిష్ లుక్

**హైదరాబాద్, మహా:** బుల్లి తెర యాంకర్‌గా గుర్తింపు తెచ్చుకున్న అనసూయ భరద్వాజ్ ప్రస్తుతం సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ తన ఫ్యాషన్ లుక్స్‌తో ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె చీరలో చేసిన ఫొటోషూట్‌కు సంబంధించిన చిత్రాలు నెట్టింట వైరల్‌గా మారుతున్నాయి. ఆలివ్ గ్రీన్ రంగు జార్జెట్ చీరను ధరించిన అనసూయ, దానికి సరిపోయే స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో కొత్త లుక్‌లో కనిపించింది. చీరపై ఉన్న నలుపు, తెలుపు గీతల డిజైన్ ఆమె వస్త్రధారణకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కర్లీ హెయిర్‌ను ఓపెన్‌గా వదిలి కెమెరాకు ఆమె ఇచ్చిన ఫోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్న కొద్దిసేపటికే అభిమానుల నుంచి స్పందనలు వెల్లువెత్తాయి. అనసూయ లుక్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. యాంకర్‌గా పాపులర్ అయిన ఆమె 'రంగస్థలం' చిత్రంలోని రంగమ్మత్త పాత్రతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం 'పుష్ప'తో పాటు పలు చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించింది. నటనతో పాటు ఫ్యాషన్, ఫిట్‌నెస్‌కు సంబంధించిన పోస్టులతోనూ అనసూయ తరచూ సోషల్ మీడియా దృష్టిని ఆకర్షిస్తోంది.



# జనవరి 13న చిరంజీవి 'కాక'

హైదరాబాద్, మహా: మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు చిత్రబృందం కీలక అప్‌డేట్ ఇచ్చింది. చిరంజీవి, దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో రూపొందుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాక' విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. 2027 సంక్రాంతి సందర్భంగా జనవరి 13న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో కొంతకాలంగా కొనసాగుతున్న రిలీజ్ డేట్ ఊహాగానాలకు తెరపడింది.'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి, బాబీ కలిసి చేస్తున్న చిత్రం కావడంతో 'కాక'పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. చిరంజీవి మాస్ ఇమేజ్‌కు అనుగుణంగా యాక్షన్, ఎమోషన్, కమర్షియల్ అంశాలను మేళవిస్తూ దర్శకుడు బాబీ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ నారాయణ నిర్మిస్తున్నారు.తెలుగు ప్రేక్షకులతో పాటు ఇతర భాషల అభిమానులను దృష్టిలో ఉంచుకుని సినిమాను విస్తృత స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదల తేదీని ప్రకటించిన మేకర్స్ త్వరలో సినిమా నుంచి తొలి పాటను కూడా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు. దీంతో చిరంజీవి అభిమానుల్లో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 2027 సంక్రాంతి బరిలో 'కాక' విడుదల కానుండటంతో ఆ సీజన్‌లో రాబోయే సినిమాలపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com